


ఆకట్టుకున్న..సిల్క్ చీర!

గుర్తింపు పెద్దదే : పెద్దాపురం సిల్క్‌కు జాతీయ ఖ్యాతి

ఎప్పుడో బ్రిటీష్ కాలం నాటి రోజుల్లో పెద్దాపురంలో సిల్క్ పట్టు చీరలకు ఎంతో ప్రసిద్ధి చెందింది. ఆరోజుల్లో అంటే 1913లో పెద్దాపురంలో శ్రీలక్ష్మీ సిల్క్ మాన్యుఫ్యాక్చరింగ్ వర్క్స్ పేరుతో ఓ పెద్ద సిల్క్ ఫ్యాక్టరీయే ఉండేది. దేశంలోనే నాణ్యమైన వస్త్రాలకు ఇక్కడ పెట్టింది పేరు. సిల్క్ పట్టు చీరలకు, పంచె లకు కేరాఫ్‌గా మారింది. తర్వాత శ్రీలక్ష్మీ సిల్క్ ఫ్యాక్టరీ మూడు దశాబ్దాల కిందటే మూతపడింది. కానీ పట్టు వస్త్రాల తయారీ మాత్రం ఇప్పటికీ కొనసాగుతోంది. నాణ్యతకు పెట్టింది పేరుగా ఉన్న పెద్దాపురం సిల్క్ పట్టు చీరలకు ఇప్పుడు జాతీయ అవార్డు లభించింది. కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం ఢిల్లీలో వన్ డ్రిస్టిక్ట్ వన్ ప్రొడక్ట్ పథకం కింద ఈ అవార్డు అందుకున్నారు..



1913లో స్థాపించిన పెద్దాపురం సిల్క్ ఫ్యాక్టరీ



అవార్డు అందుకుంటున్న కలెక్టర్

5



ధైర్యంగా ఉండండి.. మేమున్నాం!

లైంగిక వేధింపుల నిందితులను ఉద్యోగాల నుంచి తొలగించాలి : రాయపాటి

చదువుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పేద కుటుంబాలకు చెందిన బాలికలు, యువతలు లైంగికంగా వేధింపులకు గురై మానసికంగా క్షోభకు గురికావడం బాధాకరం. న్యాయం జరుగుతుందో లేదోనన్న సంశయం, పరీక్షలో ఫెయిల్ చేస్తారేమో, శిక్షణలో ఇబ్బందులు కలిగిస్తారేమోనన్న భయాలతో వేధింపులకు గురైన విద్యార్థినులు, ఉద్యోగినులు పై అధికారులకు ఫిర్యాదు చేయకుండా మౌనంగా వారిలో వారే కుమిలిపోతున్నారు. అమ్మాయిలు ధైర్యంగా ఉండాలి.. తప్పుచేసిందెవరైనా ధైర్యంగా ఎదుర్కోవాలి.. మీకు మేమున్నాం అంటూ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ పిలుపునిచ్చారు. జీజీహెచ్‌లో పారా మెడికల్ విద్యార్థినుల లైంగిక వేధింపుల ఘటనపై ఆమె స్పందించారు. విద్యార్థులను కలిసి ధైర్యం చెప్పారు. - 5లో



చెత్తగించారు!

విద్యుత్ ప్లాంట్ కేరాఫ్ రామేశంమెట్ట?



చెత్త కనిపించదంతే..

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీలు కలిపి 11 వరకు ఉన్నాయి. వీటి పరిధిలో రోజూ భారీగా చెత్త పోగ వుతోంది. నిత్యం ఈ చెత్తంతా మునిసిపల్ సిబ్బంది నగరాలు, పట్టణాలకు దూరంగా డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు.ఈ మేరకు వందల కొద్దీ వాహనాలు, ఉద్యోగులు అవసరమవు తున్నారు. ఇలా పోగవుతున్న చెత్తతో డంపింగ్‌యార్డులు చిన్నపాటి కొండలను తల పిస్తున్నాయి. ప్రభుత్వం ఆ చెత్తం టిని ఒక చోటకు తరలించి విద్యుదుత్పత్తిని చేపట్టేలా కొత్త ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్రాజెక్టు రూ.370 కోట్లతో పట్టాలెక్కించాలని నిర్ణయించింది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.370 కోట్లతో నిర్మించనున్న చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్రాజెక్టు గాల్లో పడింది. తొలుత ఖరారు చేసిన తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం బలబద్రపురంలో ప్రాజెక్టు రద్దయిపోయింది. బలబద్రపురంలో ఇప్పటికే గ్రాసిం కాలుష్యంతో ప్రజలు ఇబ్బంది పడు తున్న నేపథ్యంలో విద్యుత్ తయారీ ప్రాజెక్టును స్థానిక ఎమ్మెల్యే నల్లమిల్లి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అటు మునిసిపల్ మంత్రికి ఇప్పటికే తన అభ్యంతరాలు వివరించారు. దీంతో బలబద్రపురంలో ప్రాజెక్టు ఉపసంహరించుకోవాలని అధికారులు నిర్ణయించారు.ఈ ప్రాజెక్టుకు కాకినాడ జిల్లా పెద్దాపురం పెద్దాపురం రామేశంమెట్ట అనువు గా ఉంటుందని భావిస్తున్నారు.ఎమ్మెల్యే రాజప్ప సైతం ఇక్కడ దీని ఏర్పాటుకు సుముఖంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడే విద్యుత్ తయారీ ప్రాజెక్టు ఏర్పాటుకు అధికారులు మొగ్గు చూపుతున్నారు. దీంతో మునిసిపల్ మంత్రి నారాయణ,కాకినాడ జిల్లా కలెక్టర్ కలిసి నేడో,రేపో దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

13 నగరాలు.. వెయ్యి టన్నుల చెత్త

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 11 మునిసిపాలిటీలతో పాటు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని మరో 11 కార్పొరేషన్లు, మునిసిపాలిటీలను కలిపి కాకినాడ- రాజమహేంద్రవరం క్లస్టర్‌గా ప్రభుత్వం ప్రతిపాదించింది. ఉమ్మడి తూర్పు, ఉమ్మడి పశ్చిమలో కలిపి రోజుకు 950 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతున్నట్టు లెక్కలు కట్టింది.అత్యధికంగా ఉమ్మడి తూర్పు పరిధిలోని కాకినాడ కార్పొరేషన్‌లో రోజుకు 144 టన్నులు, రాజమహేంద్రవరం కార్పొరేషన్ 160, పిఠాపురం 26, పెద్దాపురం 25, సామర్లకోట 23, రామచంద్రపురం 23, మండపేట 26, ముమ్మిడివరం 11, అమలాపురం 30, నిడదవోలు 22, కొవ్వూరు 26 మునిసిపాలిటీల పరిధిలో దాదాపుగా 30 టన్నుల చొప్పున చెత్త రోజువారీ వస్తోంది. ఈ చెత్తంటిని ఒక చోటకు చేర్చి రోజుకు 12 మెగావాట్ల వరకు విద్యుదుత్పత్తి చేయవచ్చని తేల్చారు.12 మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్లాంట్‌కు రూ.370 కోట్ల వరకు ఖర్చవుతుండగా ప్రభుత్వం పైసా పెట్టుబడి పెట్టకుండా ప్రైవేటు కంపెనీయే భరించేలా ఇటీవల నిర్ణయం తీసుకుంది. చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేసే కంపెనీయే ఈ మొత్తం భరించేలా టెండర్లు పిలిచింది. ఎంపికైన సంస్థ ఈ మొత్తం భరిస్తే ప్రభుత్వం తరఫున చెత్త ఇవ్వడం, ఉత్పత్తయిన విద్యుత్ 25 ఏళ్ల పాటు సదరు కంపెనీయే సొంతంగా విక్రయించుకునే వెసులుబాటు కల్పించింది.ఒక రకంగా చెప్పాలంటే ప్రభుత్వానికి భారం లేకుండా రెండు కార్పొరేషన్లు, తొమ్మిది మునిసిపాలిటీల్లో చెత్తంతా బయటకు వెళ్లిపోనుంది.

తొలుత బలభద్రపురమే కానీ..

ఈ ప్రాజెక్టుకు అత్యంత అనువైన ప్రాంతంగా మూడు నెలల కిందట అనపర్తి నియోజకవర్గాన్ని గుర్తించారు. బిక్కవోలులో 12 ఎకరాలు, బలబద్రపురంలో 20 ఎకరాలను అధికారులు

- రూ.370 కోట్లతో విద్యుత్ ప్లాంట్
- ఎమ్మెల్యే, జనం నుంచి వ్యతిరేకత
- మంత్రి నారాయణతోను చర్చ
- టెండర్లలో మినహాయింపు
- బలభద్రపురంలో ప్రాజెక్టు రద్దు
- తాజాగా రామేశంమెట్ట పరిశీలన
- నేడు మంత్రి నారాయణ రాక
- ఖరారుకానున్న తుది ప్రాంతం
- ఊపిరిపీల్చుకున్న ప్రజానీకం

ఎంపిక చేశారు. 12 ఎకరాల్లో విద్యుత్‌ప్లాంట్, 20 ఎకరాల్లో తెచ్చిన చెత్తంతా పోగుచేసి విద్యుత్ ఉత్పత్తికి అనువుగా మార్చడానికి ప్రాజెక్టును సిద్ధం చేశారు.మంత్రి నారాయణ సైతం స్థలాన్ని పరిశీలించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి చెత్తను తెచ్చి బలబద్రపురంలో స్టాక్ చేయడం కోసం అనువుగా ఉందని గుర్తించారు. ఇక్కడ చెత్త నుంచి తయారయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానించుకునేందుకు వీలుగా విద్యుత్ లైన్ ఉండడంతో ప్రాజెక్టు ఇక్కడే అని ఖాయం చేసేశారు. దీనిపై స్థానిక ప్రజల నుంచి, అటు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. చెత్తంతా తెచ్చి ఇక్కడ పోగేస్తే జనం ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుందని..నిత్యం ఊరుచుట్టూ వందల్లో చెత్త లారీలు తిరిగితే జనం నానా ఇబ్బందులు పడతారని మంత్రి నారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. ఇప్పటికే గ్రాసిం పరిశ్రమ కాలుష్యంతో నరకయాతన పడుతున్న జనానికి ఇది మరో తీవ్ర ముప్పవుతుందని వివరించారు. మరో పక్క చెత్త నుంచి విద్యుదుత్పత్తి ప్లాంట్ తమ ప్రాంతంలో వద్దంటూ బిక్కవోలు, బలబద్రపురం పంచాయతీలు ఏకగ్రీవ తీర్మానం చేశాయి. దీంతో ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

రామేశంమెట్ట వైపు చూపు

ఇటీవల ప్రభుత్వం ఈ తరహా ప్రాజెక్టుకు టెండర్లు పిలిచింది. ఇందులో బలబద్రపురం ప్రాజెక్టును ప్రజావ్యతిరేకత నేపథ్యంలో తప్పించారు. ప్రత్యామ్నాయంగా పెద్దాపురం రామేశం మెట్ట వైపు మొగ్గుచూపుతున్నారు. ఇది జనావా సాలకు దూరంగా ఉండడం, ఇక్కడ వందలాది ఎకరాల్లో కొండలను తవ్వి గోతులుగా మార్చిన నేపథ్యంలో ప్రాజెక్టు ఏర్పాటు చేసినా ఇబ్బంది ఉండదని అధికారులు భావిస్తున్నారు.ఎమ్మెల్యే రాజప్ప సైతం సుముఖంగా ఉన్నారు.దీంతో ఇక్కడే దాదాపుగా ప్రాజెక్టు ఖాయం అయ్యే అవకాశం ఉంది.ఈ ప్రాజెక్టును కాకినాడ- రాజమహేంద్ర వరం క్లస్టర్ కింద ప్రతిపాదించారు. నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారా యణ పెద్దాపురం నియోజకవర్గంలో తొలి అడుగు కార్యక్రమం కోసం వస్తున్నారు. చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్రా జెక్టుకు ఇక్కడ భూములు పరిశీలించనున్నారు.ఆ తర్వాత కలెక్టర్‌తో చర్చించి ఖరారు చేయనున్నారు.

రేపటి నుంచి మునిసిపల్ కార్మికుల సమ్మె

కొవ్వూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : డిమాండ్ల సాధనకు మునిసిపల్ కార్మికులు సమ్మెకు దిగనున్నారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కొవ్వూరు మునిసిపల్ కమిషనర్ సందీప్‌కు పారిశుధ్య కార్మికులు సమ్మె నోటీసు అందించారు. కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ ఆప్కాస్ స్థానంలో ప్రైవేటు ఏజెన్సీలకు అధికారం ఇవ్వాలనే ప్రతిపాదనలు ఉపసంహరించాలన్నారు. పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, వయో పరిమితి 62 ఏళ్లకు పెంచాలని, 17 రోజుల సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఎక్స్‌గ్రేషియా 5 లక్షల నుంచి 7 లక్షలకు పెంచాలని, దహన సంస్కారాలకు రూ. 20 వేలు అందించాలని డిమాండ్ చేశారు. మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు జీవో నంబరు 26 ప్రకారం ఆదాయపరిమితితో సంబంధం లేకుండా పథకం వర్తిస్తుందని ప్రకటించినప్పటికీ కొవ్వూరు పురపాలక సంఘంలో అమలు కాలేదన్నారు.లోపాలను సరిదిద్ది తక్షణం తల్లికి వందనం అమలుచేయాలని డిమాండ్ చేస్తూ జూలై 16 నుంచి మునిసిపల్ కార్మికుల సమ్మె చేపడుతున్నట్టు నోటీసు అందించారు.కార్యక్రమంలో ఎం.సుందరబాబు, భూపతి రవీంద్ర, పి.వాసు, కళ్యాణి రాజేష్, రాజాన అప్పారావు, ఎం.కిషోర్, మీసాల జ్యోతి పాల్గొన్నారు.

కొవ్వూరులో కమిషనర్‌కు నోటీస్



కొవ్వూరు మునిసిపల్ కమిషనర్ సందీప్‌కు సమ్మెనోటీసు అందిస్తున్న కార్మికులు



జన సైనికులతో మాట్లాడుతున్న జనసేన రాష్ట్ర కార్యదర్శి శివశంకర్

కొవ్వూరులో ఏం జరుగుతోంది?

జనసేన రాష్ట్ర జనరల్ సెక్రటరీ తమ్మిరెడ్డి శివశంకర్ విచారణ

కొవ్వూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు నియోజకవర్గ జనసైనికులతో జనసేన రాష్ట్ర జనరల్ సెక్రటరీ తమ్మిరెడ్డి శివ శంకర్ సమావేశమయ్యారు. ఇటీవల జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ.రామారావు నియోజకవర్గంలో జనసేన కార్యకర్తలకు గౌరవం లభించడం లేదని, రోడ్డు కం రైలు వంతెన టోల్‌గేటు వద్ద నిరసన దర్నా చేపట్టారు. దీంతో పార్టీ అధిష్ఠానం కూటమి స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్నారని టీవీ.రామారావుని ఇన్‌చార్జి పదవి నుంచి తప్పించారు. జనసేన పార్టీ సోషల్ మీడియాలో కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో కొవ్వూరు నియోజకవర్గంలో నెలకొన్న పరిణామాలపై విచారించి నివేదిక ఇవ్వాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్‌ను జనసేనాని పవన్‌కల్యాణ్ సూచించారు. ఈ మేరకు సోమవారం కొవ్వూరు జనసేన పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో శివశంకర్ సమావేశమయ్యారు. అనంతరం మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ సభ్యులు,సీనియర్ నాయకులతో సమావేశమై ఆరా తీశారు.



సమస్య వింటున్న కలెక్టర్ ప్రశాంతి

పీజీఆర్ఎస్‌లో 238 అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్ జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలు సత్వర పరిష్కారం చూపేవిధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ ప్రశాంతి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జేసీ, ఇతర అధికారులతో కలిసి 238 అర్జీలను స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఐవీఆర్ఎస్‌ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వ భూమిలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ల ద్వారా ఇంజక్షన్ కోసం 37 మంది పేదలను కోర్టు చుట్టూ తిప్పుతూ మానసికంగా,ఆర్థికంగా ఇబ్బందులు పెడుతున్న కేసుల్లో ప్రభుత్వం వారు ఇంప్లీడ్ పిటిషన్ వేసి తమకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం వద్ద అఖిల భారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 36 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్‌ని నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వచ్చిన ప్రజల నుంచి అడిషనల్ ఎస్పీలు ఎన్ బీఎం మురళీకృష్ణ(అడ్మిన్), ఏవీ సుబ్బరాజు (లా అండ్ ఆర్డర్) 36 ఫిర్యాదులను స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి సమస్యపై ఆరా తీశారు. చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆదేశిస్తూ సంబంధిత అధికారులకు ఫిర్యాదులను పంపించారు.



రాజమహేంద్రవరంలో రివర్ ఫ్రంట్ పనులు

సమయం లేదు.. మిత్రమా!

ఆరంభం కాని పుష్కర పనులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

గోదావరి పుష్కరాలు 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకూ నిర్వహించనున్నారు. రోజులు తరుగుతున్నాయి. ఇంకా రెండేళ్ల సమయం మాత్రమే ఉంది. కానీ చేయాల్సిన పనులు మాత్రం బోలెడు ఉన్నాయి. గత పుష్కరాలను అప్పటి టీడీపీ ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. సుమారు 5 కోట్ల మంది జనం పుణ్యస్నానాలు ఆచరించారు. ఇప్పుడు ఆ సంఖ్య 10 కోట్లు ఉంటుందని అంచనా.కానీ పనులు మాత్రం ఇంకా కాగితాలపై ఉన్నాయి. ఇప్పటికే ఇద్దరు ప్రత్యేక అధికారులను నియమించినా వాళ్లు ఇంకా ఆ విధులకు ఓంకారం చుట్టలేదు. రాష్ట్ర ప్రభుత్వం 12 మందితో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది.అది కూడా పనిలోకి దిగాల్సి ఉంది.పుష్కర పనులకు శ్రీకారం ఎప్పుడా అని గోదారమ్మ ఎదురు చూస్తోంది.

నిధుల వరద కాగితాల్లోనే..

అన్ని శాఖలు ఇప్పటికే తమ ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించాయి. ముసాయిదా ప్లాన్ సిద్ధమైంది. ఏపీలోని గోదావరి పరీవాహక ప్రాంతంలోని సుమారు 20 ప్రధాన ఘాట్లలో రోజుకు లక్ష మంది వరకూ పుణ్యస్నానాలు ఆచరిస్తారని అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకూ పర్యాటక, దేవాదయ, జల వనరులు, రెవెన్యూ, మునిసిపల్ శాఖలు మాత్రం పలు సమీక్షలు నిర్వహించాయి. పుష్కర భక్తులకు బస, రవాణా ఏర్పాట్లతో పాటు ఇప్పటికే రాజమహేంద్రవరంలో ఉన్న ఘాట్లకు అదనంగా మరో 4 నిర్మించాలని నిర్ణయించారు.వీటికి రూ.900 కోట్లతో, మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో రోడ్లకు రూ.460 కోట్లు,ఆర్‌అండ్‌బీ ద్వారా రూ.680 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు.మొత్తంగా సుమారు రూ.3 వేల కోట్లు ఖర్చవుతుందని ప్రాథమిక అంచనా వేస్తుండగా.. ఇప్పటికి కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించింది.ఇటీవల అఖండ గోదావరి ప్రాజె క్టు పనులు రూ.100 కోట్ల అంచనాతో ప్రారం భించారు.రివర్‌ఫ్రంట్ పనులు జరుగుతున్నాయి. మిగిలిన పనులకు కొబ్బరి కాయలు కొట్టలేదు.

గతం కంటే మెరుగ్గా

గత పుష్కరాలకు రాజమహేంద్రవరంలోని కోటిలింగాల ఘాట్‌ను 1.5 కిలోమీటర్ల నిడివితో నిర్మించారు. మిగతా ఘాట్లను కూడా అభివృద్ధి చేశారు. ఇప్పుడు వాటికి ఏమైనా మరమ్మతులు ఉంటే చేయడంతో పాటు కొత్తవి కూడా నిర్మిస్తారు. కోటిలింగాల ఘాట్ నుంచి పుష్కరాల రేవు గుండా వీఐపీ ఘాట్ వరకూ ఒకే ఘాట్ నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. నిడద వోలు, కొవ్వూరు,తాళ్లపూడి మండలాల్లో 29 ఘాట్లకు మరమ్మతులు,4 కొత్త వాటికి రూ.100 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు. రాజమహేంద్రవరం రూరల్, సీతానగరం, కడియం మండలాల్లో 23 ఘాట్లకు మరమ్మతులు,5 కొత్త ఘాట్ల నిర్మాణాలకు రూ.7 కోట్లు ప్రతిపాదించారు. మరోవైపు పర్యాటకానికి పెద్దపీట వేయనున్నారు.

డివిజన్ల వారీగా ప్రతిపాదనలు..

2015లో టీడీపీ ప్రభుత్వ హయాంలో పుష్కరాలు నిర్వహించారు. అప్పట్లో రాజమహేంద్రవరంలోని ఘాట్ల అభివృద్ధి తదితర ఏర్పాట్లకు రూ.200 కోట్లు విడుదల చేశారు. ప్రస్తుత మార్కెట్ రేట్ల ప్రకారం ఇప్పుడు ఆ బడ్జెట్ గణనీయంగా పెరగనుంది.రాజమహేంద్రవరం మునిసిపాలిటీకి ప్రత్యేకంగా,మిగతా శాఖలకు ఆయా రెవెన్యూ డివిజన్ల కింద నిధులు విడుదల చేయాలని ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. రెండు రెవెన్యూ డివిజన్లకు రూ.1400 కోట్లతో అంచనాలు రూపొందించగా.. మరోవైపు నగరపాలక సంస్థ ఇప్పటికే 1587.80 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది.రాజమహేంద్రవరం డివిజన్‌లో దాదాపు 550 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం, మరమ్మతులు, విస్తరణ చేయడానికి రూ.400 కోట్లు అవసరత చూపించారు.కొవ్వూరు డివిజన్‌కు సంబంధించి రూ.250 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేశారు. ఘాట్లకు వెళ్లే రహదారులు, ప్రధాన, పార్కింగ్ ప్రాంతాలకు..ఇలా నాలుగు విభాగాలుగా రహదా రుల అంచనాలు..రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు తదితర నియోజకవర్గాల్లో ఘాట్ల అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించారు.

చిన్నమ్మ చొరవ చూపాల్సిందే..



రాజమహేంద్రవరం ఎంపీగా పురందేశ్వరి ప్రాతినిధ్యం వహిస్తు న్నారు. రైల్వేపరంగా ఎంపీ వేగంగా కదిలినా పనుల్లో కదలిక కనిపించడం లేదు. పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం కంటే కేంద్ర ప్రభుత్వ నిధులే అత్యంత ప్రాధాన్యమైనవి.ఆ ని ధుల రాకలో కదలిక ఉండాలంటే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అయినా ఎంపీ ప్రస్తావించాలి. అయితే ఇప్పటి వరకూ కనీసం అధికారులు ఒక సమగ్రమైన డీపీఆర్(డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు) ఆమె చేతికి అందించలేదు. దీనిపై ఆమె కూడా కాస్త అసహనంగానే ఉన్నట్టు తెలుస్తోంది. చివరి నిమిషంలో హడా వుడి పడితే నిధుల దుర్వినియోగం కావడంతో పాటు పనుల్లో నాణ్యత కూడా నాసిరకంగా మారే అవకాశానికి మార్గం సుగమం చేసినట్లే.

- రెండేళ్లలో గోదావరి పుష్కరాలు
- రూ.3 వేల కోట్లతో అంచనాలు
- ఇంకనూ ప్రతిపాదనల్లోనే పనులు
- ఎక్కడా ఆరంభంకాని వైనం
- కానరాని పుష్కర ప్రత్యేకాధికారులు
- కేవలం రూ.100 కోట్లు విడుదల
- అవీ అఖండ గోదావరి నిధులు

రూ.3 వేల కోట్లు

రాజమహేంద్ర వరం,కొవ్వూరు డివిజన్లలో సుమారు రూ.440 కోట్ల అంచనా వ్యయంతో వివిధ ప్రాజెక్టులకు ప్రతిపాదనలు తయారు చేశారు. రెండు డివిజన్లకూ కలిపి అగ్నిమాపక శాఖ రూ.8 కోట్లు, ఆర్టీసీ రూ.27 కోట్లు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా రూ.25 కోట్లు, వైద్యారోగ్య రూ.8 కోట్లు, విద్యుత్ రూ.50 కోట్లు ఇలా అన్ని శాఖలూ ప్రతిపాదనలు పంపించాయి. మొత్తంగా 12 రోజుల్లో దాదాపు 10 కోట్ల మంది రాజమ హేంద్రవరం పరిసర ప్రాంతాలకు పుష్కర స్నా నాలకు వస్తారని అంచనా వేస్తుండగా.. రూ.3 వేల కోట్లకుపైగా ఖర్చు చేసి భక్తులకు ఇబ్బందీ కలగకుండా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది.



కవర్ల వినియోగంపై కలెక్టర్ సీరియస్

కఠినంగా ప్లాస్టిక్ నిషేధం

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్టు కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ పి. ప్రశాంతి తెలిపారు.నగరంలో సోమవారం ఆమె ఆకస్మిక దాడులు చేశారు.ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తున్నామన్నారు. పర్యావరణానికి హానికరమైన దాదాపు 20 రకాల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను ప్రభుత్వ నిషేధించిందన్నారు. 120 మైక్రాన్ల కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ కవర్లను నిలిపివేయాలన్నారు. ప్రజలంతా జ్యూట్ బ్యాగ్‌లు వాడాలన్నారు.ఆమె వెంట ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న తదితరులు ఉన్నారు.

'గృహనిర్మాణాలు వేగవంతం చేయండి'

రాజమహేంద్రవరం, జూలై14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గృహ నిర్మా ణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశించారు.నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి సోమవారం హౌసింగ్, రెవిన్యూ, విద్య తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి నిర్మాణంపై ఎంపీడీవోలు, ఏఈలు ర్యలు తీసుకోవాలన్నారు.పాఠశాలల్లో సౌకర్యాలు, మధ్యాహ్నం భోజన పథనం అమలు తనిఖీ చేసి ఎంపీడీవోలు, తహశీల్దార్లు నివేదిక ఇవ్వాలన్నారు.ఉప విభజన సర్వేనీటి పన్ను, సంక్షేమ హాస్టళ్ల సమస్యలపై జేసీ చిన్న రాముడు సమీక్షించారు.



రైల్ వన్... ఆల్ ఇన్ వన్

ఇప్పటివరకు రైలులో ప్రయాణించేందుకు రిజర్వేషన్ టిక్కెట్లు తీసుకోవాలంటే ఒక యాప్, అన్ రిజర్వ్‌డ్, ఫ్లాట్‌ఫామ్ టిక్కెట్ల కోసం మరో యాప్, రైలు ప్రయాణిస్తున్న తీరు తెలుసుకునేందుకు ప్రత్యేకమైన ప్రైవేటు యాప్‌లు, ఇవి గాక రైలులో ప్రయాణిస్తూ ఫుడ్ ఆర్డర్ పెట్టడానికి మరో యాప్... ఇలా ఒక్కో అవసరానికి ఒకో యాప్ వినియోగిస్తూ ప్రయాణికులు కొంచెం గందరగోళానికి గురయ్యేవారు. ఇప్పుడు ఇలాంటి వాటికి చెక్ పెడుతూ రైల్వే శాఖ రైల్‌వన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో ఒకే క్లిక్‌తో అన్ని రకాల సేవలు పొందే అవకాశం ఏర్పడింది.

- అన్ని రైల్వే సేవలు ఒకేచోట
- అందుబాటులోకి యాప్
- ఒకే క్లిక్‌తో సులువుగా సేవలు పొందే వీలు
- సింపుల్‌గా రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- టిక్కెట్లు బుకింగ్, రైలు ట్రాకింగ్, ఫుడ్ ఆర్డర్లు ఇక సులువు



(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

రైలులో ప్రయాణించే వారు టిక్కెట్ల బుకింగ్‌తో పాటు వివిధ సేవలు పొందేందుకు వేర్వేరు యాప్‌లు వినియోగిస్తూ పడుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు రైల్వే శాఖ తీసుకువచ్చిన రైల్‌వన్ యాప్ జూలై 1 నుంచి అందుబాటులోకి వచ్చింది. నాలుగైదు యాప్‌లు వినియోగించే జంఝాటానికి చెక్ పెడుతూ తీసుకువచ్చిన ఈ సూపర్‌యాప్ ప్రయాణికుల ప్రశంసలు అందుకుంటోంది. కేవలం 14 రోజుల వ్యవధిలోనే గూగుల్ యాప్ స్టోర్ నుంచి 10లక్షల మందికి పైగా ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. యాప్ డౌన్‌లోడ్, రిజిస్ట్రేషన్, టికెట్ బుకింగ్ సులువుగా ఉండడంతో ఇతర రైల్వే యాప్‌లు వినియోగించేవారు ఇప్పుడు రైల్ వన్ యాప్‌పై మొగ్గుచూపుతున్నారు.

రిజిస్ట్రేషన్ ఇలా...


రైల్‌వన్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ లేదా యాపిల్ స్టోర్ నుంచి మన ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని ఓపెన్ చేయగానే కొత్త యూజర్ల కోసం రిజిస్ట్రేషన్ పేజీ ఓపెన్ అవుతుంది. అందులో మన పేరు, వయసు, పుట్టిన తేదీ, ఇతర వివరాలు నమోదు చేసి ఆధార్ నెంబర్ ఎంటర్ చేయాలి. మనం ఇచ్చిన వివరాలు ఆధార్‌తో సరిపోవాలి. చిన్న వ్యత్యాసమున్నా యాప్ అంగీకరించదు. అనంతరం మొబైల్ నెంబరు ఇచ్చి ఆధార్‌తో అథంటికేషన్ చేసుకోవాలి. యూజర్ నేమ్, పాస్‌వర్డ్, పిన్ సెలక్ట్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రతిసారీ యాప్ ఓపెన్ చేసినప్పుడు పాస్‌వర్డ్, పిన్ ఎంటర్ చేయాల్సి ఉంటుంది. బయోమెట్రిక్ ఆప్షన్ ఎనేబుల్ చేస్తే ఫింగర్ ప్రింట్ మొబైల్‌లో స్కాన్ చేస్తే యాప్ ఓపెన్ అవుతుంది.

టికెట్ల బుకింగ్ ఇక్కడే...


ఐఆర్‌సీటీసీ యాప్‌లో కేవలం రిజర్వేషన్ టికెట్లు మాత్రమే బుకింగ్ చేసుకునే అవకాశం ఉండేది. అన్ రిజర్వ్‌డ్, ప్లాట్‌ఫామ్ టికెట్లు మరో యాప్‌లో బుక్ చేసుకోవాల్సి వచ్చేది. యూటీఎస్ యాప్‌లో ప్లాట్‌ఫామ్ టికెట్ తీసుకోవాలంటే మనం రైల్వే స్టేషన్‌కు నిర్దేత దూరంలో ఉంటేనే సాధ్యమయ్యేది. రైల్వేవన్ యాప్‌తో ఈ ఇబ్బందులేవీ ఉండవు. రిజర్వేషన్, అన్ రిజర్వ్‌డ్, ఫ్లాట్‌ఫామ్ టికెట్లను బుక్ చేసుకునేందుకు వేర్వేరు విండోలు ఇచ్చారు. వాటిపై క్లిక్ చేసి మనకు కావాల్సిన స్టేషన్ల వివరాలు నమోదు చేసి టికెట్లు తీసుకోవచ్చు. ఐఆర్‌సీటీసీ యాప్‌లో రైళ్ల సెర్చింగ్, టికెట్లు బుకింగ్‌కు ఒకే విండో ఉండేది. ఇందులో మాత్రం వేర్వేరు విండోలు ఉండడంతో ప్రయాణికులకు సులువుగా ఉంటుంది. రిజర్వ్‌డ్ విండో క్లిక్ చేసి అన్ని క్లాసుల రిజర్వేషన్ టికెట్లు బుక్ చేసుకోవచ్చు. కుటుంబసభ్యుల వివరాలతో పాటు తరచూ మనతో ప్రయాణించే వారి వివరాలను ఇందులో నమోదు చేసుకుని సేవ్ చేసుకోవచ్చు. దీని వలన టికెట్లు తీసుకునే సమయంలో సులువుగా ఉంటుంది. అన్ రిజర్వ్‌డ్ విండోలోకి వెళ్లి సాధారణ టికెట్లతో పాటు సీజనల్ పాస్‌లు కొనుగోలు చేసే వెసులుబాటు ఉంది.

అన్నీ ఇక్కడే...

రైళ్లలో ప్రయాణించే వారు ఆహార పదార్థాలు ఆర్డర్ చేయాలంటే ఇతర యాప్‌లపై ఆధారపడాల్సి వచ్చేది. రైల్‌వన్ యాప్‌లో ఆర్డర్ ఫుడ్ విండో క్లిక్ చేసి మనక నచ్చిన ఫుడ్ ఆర్డర్ చేస్తే మనం ఎంచుకున్న స్టేషన్‌లో మన సీటు వద్దకే వచ్చి అందజేస్తారు. రైళ్ల లైవ్ ట్రాకింగ్ కోసం ఇప్పటిదాకా థర్డ్‌పార్టీ యాప్‌లపై ఆధారపడాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ యాప్‌లో ట్రాక్ యువర్ ట్రైన్ విండో క్లిక్ చేసి రైలు ఎక్కడ ఉంది.. ఆయా స్టేషన్లకు వచ్చే సమయాలు తదితర వివరాలను తెలుసుకునే అవకాశం ఉంది. ఇందులో కోచ్ పొజిషన్ తెలుసుకోవచ్చు. పీఎన్ఆర్ స్టేటస్, టికెట్లు రద్దు చేసుకుంటే రిఫండ్ స్టేటస్ తెలుసుకోవచ్చు.



ఇబ్బంది ఎదురైతే...



రైలులో ప్రయాణిస్తున్న సమయంలో ఎటువంటి ఇబ్బంది, సమస్య ఎదురైనా తక్షణం రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ యాప్‌లో అవకాశం కల్పించారు. రైల్ మదద్ విండోపై క్లిక్ చేసి మన రైలు నెంబరు, వివరాలు, ఏ స్టేషన్‌లో హెల్ప్ కావాలి, సమస్య, ఇబ్బంది వివరాలు, వీడియో లేదా ఆడియో లేదా ఫొటో జత చేసి అప్‌లోడ్ చేస్తే రైల్వే అధికారులు తక్షణం స్పందిస్తారు. మీరు క్లిక్ చేయగానే ఆ వివరాలన్నీ రైల్వే ఉన్నతాధికారులకు, అక్కడి నుంచి సంబంధిత విభాగ అధికారులకు వెళ్తాయి. మన ప్రయాణం సాగిన తీరుపై ఇదే యాప్‌లో ట్రావెల్ ఫీడ్‌బాక్ విండోపై క్లిక్ చేసి నమోదు చేయవచ్చు. అదే విధంగా రేటింగ్ ఇచ్చే ఆప్షన్ ఉంది. ఇందులో ఆర్ వేలెట్‌లో డబ్బులు యాడ్ చేసుకుని, అందులో సొమ్ముతో టికెట్లు బుక్ చేసుకోవచ్చు.



రైల్‌వన్ యాప్ గురించి రైల్వే శాఖ విస్తృత ప్రచారం సాగిస్తోంది. అయితే ఐఆర్‌సీటీసీ యాప్‌లో రిజర్వేషన్ల టికెట్ బుకింగ్ రైల్‌వన్ యాప్ కంటే ఒకింత సులువుగా ఉందనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. గత 14 రోజుల్లో ఈ యాప్‌ను పదిసార్లు అప్‌డేట్ చేయడం ద్వారా యాప్ వినియోగంలో యూజర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కొక్కటిగా రైల్వే శాఖ పరిష్కరిస్తోంది. ఈ నెలాఖరుకు అన్ని సమస్యలూ పరిష్కారమవుతాయని రైల్వే అధికారులు చెప్తున్నారు.

'మెప్మా' డిజిటలైజేషన్

- అంతా ఆన్‌లైన్‌లోనే కార్యకలాపాలు
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సిబ్బందికి 1,004 ట్యాబ్‌లు అందజేత

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో డిజిటలైజేషన్‌కు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రుణాల చెల్లింపు, రికవరీ వంటి సంస్థాగత నిర్వాహణ కార్యక్రమాలన్నీ ఇకపై ఆన్‌లైన్ లోనే జరగనున్నాయి. అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వం సరికొత్త యాప్ తీసుకువచ్చింది. డ్వాక్రా మహిళలు రుణాలను నేరుగా చెల్లించవచ్చు. గతంలో నిధులు పక్కదారి పట్టాయని ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ యాప్ ద్వారా నగదు రహిత లావాదేవీలు జరపవచ్చు. పారదర్శకతను పెంచవచ్చు. తద్వారా మోసాలకు అడ్డుకట్ట వేయచ్చు. ఇందులో భాగంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మెప్మా సిబ్బందికి ఇప్పటికే 1,004 ట్యాబ్‌లను అందజేశారు. కాకినాడ జిల్లాలో 433, తూర్పు గోదావరి జిల్లాలో 320, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 133 ట్యాబ్‌లను టెక్నికల్ ఎక్స్‌పర్ట్‌లు, సిటీ మెషిన్ మేనేజర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రిసోర్స్‌పర్సన్లు, టీఎల్ఎఫ్‌లకు పంపిణీ చేయగా మిగిలిన 118 ట్యాబ్‌లను సిబ్బందికి అందజేశారు. ఇకపై వీరంతా మెప్మాలో జరిగే లావాదేవీలు, కార్యక్రమాలన్నీ ట్యాబ్‌ల ద్వారానే నిర్వహించనున్నారు.



ట్యాబ్‌లో డ్వాక్రా మహిళ వివరాలు నమోదు చేస్తున్న రిసోర్స్‌పర్సన్ దేవి

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల నిర్వహణ, లావాదేవీలన్నీ గతంలో పుస్తకాల్లో నమోదు చేసేవారు. ఇందుకోసం గంటల సమయం కేటాయించాల్సి వచ్చేది. సంఘాల్లో అవకతవకలు జరిగినప్పుడు, తప్పిదాలు చోటుచేసుకున్నప్పుడు ఆ రికార్డులను పరిశీలిస్తే గానీ ఎక్కడ, ఎవరు తప్పుడు చేప్పు చేశారనేది తెలిసేది కాదు. ఇక నుంచి ఆ పరిస్థితి ఉండకుండా అంతా డిజిటలైజేషన్ చేశారు. ప్రభుత్వం మెప్మా సిబ్బందికి అందజేసిన ట్యాబ్‌ల్లో నాలుగు రకాల యాప్‌లు ఉన్నాయి. స్వయం సహాయక సంఘాల నిర్మాణం, కార్యక్రమాలు, రుణాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు సంబంధించి యాప్‌లు ఉన్నాయి. ఎస్‌హెచ్‌జీల నిర్వహణ, మెప్మా సేవలన్నీ ఆన్‌లైన్‌లో మహిళా యాప్ ద్వారానే నిర్వహిస్తారు. మహిళా సంఘాల సంస్థాగత నిర్మాణం, రుణాల చెల్లింపు, రికవరీ ఆన్‌లైన్‌లోనే నమోదు చేస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, ఎస్‌హెచ్‌జీలకు అమలు చేస్తున్న పథకాలను సైతం ట్యాబ్‌ల్లోనే నిక్షిప్తం చేస్తారు. సమావేశాల నిర్వహణ, ఫొటోలు, సభ్యుల హాజరు, ఇతర అంశాలన్నీ ట్యాబ్‌లోనే అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. వీటిని ఆర్పీ నుంచి మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ వరకు పరిశీలించనున్నారు. దీనివల్ల అవకతవకలు జరిగేందుకు అవకాశాలు తక్కువగా ఉంటాయి.

అవగాహన పెంచుకోవాలి



మెప్మా కార్యకలాపాల్లో ఇక నుంచి పెన్ను, పేపరు అవసరం తగ్గనుంది. అన్నీ ఆన్‌లైన్‌లోనే జరగనున్నాయి. సమాచారం అంతా ట్యాబ్‌ల్లో నిక్షిప్తం చేయాల్సి ఉంటుంది. ట్యాబ్‌ల వినియోగంపై సీవోలు, ఆర్పీలు, టీఎంసీలు అవగాహన పెంచుకోవాలి.

ప్రియంవద, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్
ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా

ఎఫ్‌డీపీతో క్వాంటం టెక్నాలజీపై అధునాతన దృక్పథం

నన్నయ వీసీ ప్రసన్నశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, జూలై 14(ఆంధ్రజ్యోతి): అధ్యాపక సభ్యులకు క్వాంటం అల్గారిథం, క్వాంటం కంప్యూటింగ్ ప్లాట్‌ఫామ్, వాటి వాస్తవ ప్రపంచ అనువర్తనాలపై ప్రాథమిక, అధునాతన దృక్పథాన్ని క్వాంటం టెక్నాలజీస్ ఎఫ్‌డీపీ అందిస్తుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఏఐసీటీఈ-ఏటీఏఎల్ సౌజన్యంతో ఎఫ్‌డీపీని సోమవారం ప్రారంభించారు. దీనికి వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఐఐటీలు, ఎన్ఐటీల నుంచి రీసోర్స్‌పర్సన్‌లు ఒకచోట చేరి వేగంగా అభివృద్ధి చెందుతున్న క్వాంటం టెక్నాలజీని మరింత అన్వేషించడమే లక్ష్యంగా ఎఫ్‌డీపీ సాగాలన్నారు. సమకాలీన విద్య, పారిశ్రామిక రంగాల్లో దాని ఔచిత్యాన్ని తెలిపారు. ఉన్నత విద్య పాఠ్యాంశాలలో క్వాంటం కంప్యూటింగ్‌ను ఏకీకృతం చేయడాన్ని ప్రోత్సహిస్తున్న ఏపీఎస్‌హెచ్‌ఈ, ఏఐసీటీఈ లక్ష్యాలతో ఎఫ్‌డీపీ నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రాన్ని భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానాలకు కేంద్రంగా మార్చే దిశగా సీఎం చంద్రబాబు ఇటీవల ప్రారంభించిన క్వాంటం వ్యాలీ ఒక అడుగు అని ప్రసన్నశ్రీ అన్నారు. ఎఫ్‌డీపీ కన్వీనర్ వి.పెర్సిస్ మాట్లాడుతూ ఆరురోజులు పాటు ఈకార్యక్రమం జరుగుతుందన్నారు. దేశ వ్యాప్తంగా వివిధ విద్యాసంస్థల నుంచి 50 మంది ఫ్యాకల్టీ సభ్యులు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు, ఎఫ్‌డీపీ కోకన్వీనర్ జి.కీర్తిమరీట, సీఎస్‌వీ విభాగాధిపతి బి.కెజియారాణి తదితరులు పాల్గొన్నారు.

గుర్రపుడెక్క తొలగింపు సత్వరం పూర్తి చేయాలి

గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సునీల్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 14(ఆంధ్రజ్యోతి): సాగునీటి కాలువలు, డ్రైనేజీల్లో తూడు, గుర్రపు డెక్క తొలగింపు పనులు సత్వరం పూర్తి చేయాలని గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ కోరారు. సోమవారం స్థానిక నీటిపారుదల శాఖ కార్యాలయంలో గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిపారుదల సక్రమంగా జరిగేందుకు చివరి ఆయకట్టుకు కూడా సాగునీరు అందించేందుకు కాలువలు, డ్రైనేజీల్లో తూడు, గుర్రపు డెక్క తొలగించాలన్నారు. నీటితీరువా వసూళ్లకు రెవెన్యూ సిబ్బందికి సహకరించాలన్నారు. నీటితీరువా వసూళ్లు జరిగితే సాగునీటి అభివృద్ధి పనులు చేపట్టడానికి నిధులు సమకూరుతాయన్నారు. గ్రామస్థాయి నుంచి నీటితీరువా వసూళ్లపై దృష్టి సారించాలని సునీల్‌కుమార్ అన్నారు. ఈస్టన్ డెల్టా సూపరింటెండెంట్ ఇంజనీర్ గోపినాథ్ మాట్లాడుతూ సమర్థవంతమైన నీటి నిర్వహణ, నీటి ఆడిటింగ్ జరపాలని కోరారు. కాలువలపై ఆక్రమణలను గుర్తించాలని, రెవెన్యూ సమన్వయం చేసుకుని తొలగింపుకు ప్రయత్నాలు చేయాలని కోరారు. గోదావరి ఈస్టన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీవీ రామకృష్ణ మాట్లాడుతూ గోదావరి డెల్టా ప్రాజెక్టు పరిధిలో రూ.6.10 కోట్లతో 159 పనులకు కమాండ్ యాక్షన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి యాక్షన్ ప్లాన్‌కు అనుమతి లభించిందని తెలిపారు. వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, డ్రైనేజీ డివిజన్ ఈఈ ఎంవీవీ కిషోర్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు పలు ప్రతిపాదనలు చేశారు. ప్రాజెక్టు కమిటీ పరిధిలో 15 మంది డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, వివిధ డివిజన్ల డీఈఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు డీసీసీబీ చైర్మన్ తుమ్మల



లక్నోలో జరిగిన సమావేశంలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు

పెద్దాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డ్), బ్యాంకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డవలప్‌మెంట్ (బీఐఆర్‌డీ) ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో జరిగిన జాతీయ స్థాయి సదస్సుకు డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) హాజరయ్యారు. 'గ్రామీణ సహకార బ్యాంకుల్లో ఉత్తమ పద్ధతులు' అంశంపై రెండు రోజుల పాటు ఈ సదస్సు నిర్వహించారు. గ్రామీణ సహకార బ్యాంకుల్లో సామర్థ్య నిర్మాణం, సాంకేతిక అభివృద్ధి, వ్యాపార వైవిధ్యీకరణ, మానవ వనరుల నిర్వహణ తదితర విషయాలపై చర్చించారు. గ్రామీణ సహకార బ్యాంకులను మరింత బలోపేతం చేసే అంశంపై ముఖ్యంగా చర్చించినట్టు రామస్వామి తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బస్సు

బస్సు ధ్వంసం.. తప్పిన ప్రాణాపాయం



గోకవరం, జూలై 14(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం కొత్తపల్లి సమీపంలో ఆదివారం రాత్రి పెను ప్రమాదం తప్పింది. గోకవరం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు కాకినాడ నుంచి గోకవరం బయలుదేరింది. కొత్తపల్లి సమీపానికి చేరుకునేసరికి ఎదురుగా ఆగి ఉన్న సిమ్మెంట్ లోడు లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ఎడమవైపు భాగం దెబ్బతింది. ఆ సమయంలో బస్సులో ప్రయాణికులు లేకపోవడం, కండక్టర్ కూడా బస్సు వెనుక సీట్లో కూర్చోవడంతో ప్రాణాపాయం తప్పింది. అర్ధరాత్రి సుమారు 12 కావడం, ఆ సమయంలో డ్రైవర్ రెప్పపాటుకు గురవ్వడం వల్లే ప్రమాదం జరిగి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు.

తిరుమల విద్యార్థులకు మంత్రి లోకేశ్ అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న మంత్రి లోకేశ్

రాజమహేంద్రవరం రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): నీట్-2025లో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 19వ ర్యాంకు, స్టేట్ మొదటి ర్యాంకు సాధించిన రాజమహేంద్రవరంలోని తిరుమల విద్యార్థి డి.కార్తీకరామ్‌కిరీటిని రాష్ట్ర విద్య, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ అభినందించారు. అలాగే జేఈఈ అడ్వాన్స్-2025లో ఈడబ్ల్యుఎస్ కేటగిరిలో ఆలిండియా 8వ ర్యాంకు సాధించిన కె.యశ్వంత్‌సాత్విక్, ఎస్సీ కేటగిరిలో ఆలిండియా 2వ ర్యాంకు సాధించిన కె.ప్రణీత్‌లను మంత్రి లోకేశ్ పుష్పగుచ్ఛంతో సత్కరించారు. విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావును అభినందించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, విద్యార్థుల తల్లిదండ్రులతో లోకేశ్‌ను కలిసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిన్న చిన్న విషయాలకే నేటి తరం విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని, లైఫ్ అంటేనే చాలెంజ్ అని దానిని ధైర్యంగా స్వీకరించాలని అధైర్య పడకూడదని చెప్పారు.

మైన్స్ విజిలెన్స్ స్క్వాడ్ ఏడీ రవికాంత్ కన్నుమూత



ఏలూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లా గనులశాఖ రీజనల్ విజిలెన్స్ స్క్వాడ్ (తూర్పు, పశ్చిమ, కృష్ణా) అసిస్టెంట్ డైరెక్టర్ రవికాంత్ (56) ఏలూరులో గుండెపోటుతో కన్నుమూశారు. ఈయన స్వగ్రామం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం. ఇతనికి భార్య, ఓ కుమారుడు ఉన్నారు. నర్సీపట్నంలో పనిచేస్తూ గతేడాది బదిలీల్లో ఏలూరు జిల్లాకు వచ్చారు. సోమవారం సాయంత్రం తన మోటారుసైకిల్‌పై వస్తూ శనివారపుపేట లోబ్రిడ్జిలో పడిపోయినట్టు చెబుతున్నారు. చాలా సేపటి తర్వాత అతన్ని చూసి ఏలూరు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందారు. ఈయన లివర్ సంబంధిత సమస్యతో సతమతమవుతూ నెల రోజులుగా సెలవులో ఉన్నట్టు చెబుతున్నారు. రవికాంత్ మృతదేహాన్ని స్వగ్రామం రాజమహేంద్రవరం బంధువులు రాత్రి తరలించారు.

గోదావరి వరద ఉధృతి తగ్గుముఖం

కాటన్ బ్యారేజీ నుంచి 3.58 లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి విడుదల



రాజమహేంద్రవరం వద్ద వరద నీటి ప్రవాహం

ధవళేశ్వరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం వద్ద గోదావరి వరద ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. దీంతో కాటన్ బ్యారేజ్ గేట్లను కిందకు దించి నీటి విడుదలను నియంత్రిస్తున్నారు. సోమవారం సాయంత్రం ధవళేశ్వరం ఆర్మ్‌లోని మొత్తం గేట్లను ఒక మీటరు మేర, ర్యాలీ, మద్దూరు, విజ్జేశ్వర ఆర్మ్‌లలో మొత్తం గేట్లను 0.60మీటర్ల మేర పైకి ఎత్తి 3,58,900 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో నీటి మట్టం 10.50 అడుగులుగా నమోదయింది. ఎగువున భద్రాచలం వద్ద క్రమంగా తగ్గుతున్న నీటి మట్టం 23 అడుగులకు చేరుకుంది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతు డిమాండ్ మేరకు వ్యవసాయ అవసరాల కోసం డెల్టా కాలువలకు నీటి విడుదలను పెంచారు. తూర్పు డెల్టాకు 5వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2600క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 6800 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు.

ఫేక్ ష్యూరిటీ పెట్టిన కేసులో ఇద్దరికి రెండున్నరేళ్ల జైలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు పోలీసు స్టేషన్ కేసులో ప్రోపర్టీగా ఉన్న ఆయిల్ ట్యాంకర్‌ను రిలీజ్ చేయించుకునేందుకు ఇద్దరు వ్యక్తులు ఫేక్ ష్యూరిటీ పెట్టినట్టు విచారణలో వెల్లడికావడంతో వారికి రాజమహేంద్రవరం 3వ అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సిరయ్య రెండున్నరేళ్ల జైలు శిక్ష విధించారు. త్రీటౌన్ పోలీసులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. 2018 అక్టోబరు 3న బొమ్మూరు కేసులో ప్రోపర్టీగా ఉన్న ఆయిల్ ట్యాంకర్‌ను విడిపించేందుకు రాజమహేంద్రవరం కంబాలపేటకు చెందిన బట్టు కుమార్, విశాఖపట్నంలోని శ్రీనగర్‌కు చెందిన నాగవల్లి రామకృష్ణ రాజమండ్రి 7వ అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో సబ్‌మిట్ చేసిన ష్యూరిటీలలో అధికారి సంతకం ఫోర్జరీ చేసినట్టు అనుమానం రావడంతో అప్పట్లో దీనిపై విచారణ జరపాలని న్యాయస్థానం ఆదేశించింది.దీంతో త్రీటౌన్ పోలీసులు విచారణ జరిపి వారు ఇచ్చిన ష్యూరిటీ ఫేక్ అని నిర్ధారించారు. దీంతో సోమవారం న్యాయమూర్తి తీర్పును వెల్లడించారు. నిందితులకు రెండున్నరేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమాన విధించారు. నిందితులకు శిక్ష పడడంలో ఏపీపీ సీహెచ్ రాజశేఖర్, త్రీటౌన్ సీఐ అప్పారావు, కోర్టు కానిస్టేబుల్ పి.కొండబాబులు కృషి చేశారు. వారిని జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ అభినందించారు.

4.4 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సీజ్

గోరింటలో అక్రమంగా నిల్వచేసిన వైనం.. నిందితులపై 6ఏ, క్రిమినల్ కేసుల నమోదు



గోరింటలో తనిఖీ చేస్తున్న డీఎస్‌వో సత్యనారాయణరాజు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం గోరింట గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన 4.4 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం (పీడీఎస్)ను జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి రుద్రరాజు సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో బృందం సోమవారం రాత్రి దాడి చేసి సీజ్ చేసింది. స్థానికుడు రాగంశెట్టి స్వామి రేషన్ బియ్యం అక్రమంగా నిల్వచేసి లారీల్లో లోడ్ చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో హుటాహుటిన డీఎస్‌వో ఆధ్వర్యంలో అధికారులు దాడి చేసి బియ్యాన్ని సీజ్ చేశారు. డీఎస్‌వో సత్యనారాయణరాజు మాట్లాడుతూ రాగంశెట్టి స్వామి అక్రమంగా తన ఇంటి వెనుక ఉన్న షెడ్‌లో పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచి రాత్రివేళల్లో బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్టు సమాచారం వచ్చిందన్నారు. రేషన్‌కార్డుదారుల నుంచి కిలో రూ.15కు కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌లో కిలో రూ.18కి విక్రయిస్తున్నారన్నారు.స్వామిపై 6(ఎ) కేసుతో పాటు పెద్దాపురం పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేయించామన్నారు.

గుర్తింపు పెద్దదే!



1913లో స్థాపించిన పెద్దాపురం సిల్క్ ఫ్యాక్టరీలో కార్మికులు

పెద్దాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టు సిల్క్‌కు జాతీయస్థాయి గుర్తింపు లభించింది. ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి (ఓడీఓపీ) పథకం కింద కేంద్రం ఈ అ వార్డును అందించింది. తమ నైపుణ్యానికి తగిన గుర్తింపు కోసం ఎంతోమంది చేనేత కార్మిక కుటుంబాలు ఎదురుచూశాయి. వారి ఆకాంక్షలను ప్రభుత్వం నెరవేర్చింది. జాతీయస్థాయి అవా ర్డును జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఢిల్లీలో కేంద్ర మంత్రి చేతుల మీదుగా అందుకున్నారు.

పెద్దాపురం సిల్క్‌కు జాతీయ స్థాయిలో ఖ్యాతి

- వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ పథకం కింద కేంద్రం నుంచి అవార్డు
- ఇక దేశవ్యాప్తంగా ప్రాచుర్యం
- మరింత ప్రోత్సాహం
- మెరుగుపడనున్న చేనేత కుటుంబాల జీవన స్థితిగతులు

డిసెంబరులో కేంద్ర బృందం పర్యటన..

గతేడాది డిసెంబరులో కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పర్య టించి పరిశీలన చేసింది. ఈ సందర్భంగా ఇక్కడ చేనేత వస్త్రాలను ప్రత్యేకత, నాణ్యతను వారు పరిశీలించారు. వీటికి సంబం. ధించిన వివరాలను జిల్లా జౌళీశాఖ ఏడీ బృంద సభ్యులకు వివరించారు. పెద్దాపురం పట్టు సిల్క్‌తో తయారు చేసిన చీర లు, ధోతీలు, పంచెలు, ఉత్పత్తులు, అమ్మకాలు, వారి జీవన స్థితి గతులపై కేంద్ర బృందానికి నివేదికలు అందించారు. పెద్దాపురం సిల్క్ వస్త్రాలు నేయడానికి ప్రత్యేక నైపుణ్యం ఉండాలి. ధోతీలకు అంచులు పలు విధాలుగా నేయాల్సి ఉంటుంది. ఎంతో నైపు ణ్యం ఉంటే కానీ ఇటువంటి వస్త్రాలను తయారుచేయడం కుదరని పని.

చారిత్రక ప్రాధాన్యం...

సంప్రదాయ మగ్గాలపై నేసిన ధోతీలు, పంచెలు, చీరలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. తాజాగా కేంద్రం జాతీయ అవార్డు ప్రకటించడంతో పెద్దాపురం సిల్క్ దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. చేనేతల కష్టం సుమారు నాలుగు దశాబ్దాల తర్వాత లభించింది. పెద్దాపురం సిల్క్‌కు చారిత్రక ప్రాధాన్యం ఉంది. స్వాతంత్ర పోరాటంలో ఈ వస్త్రాలు ప్రముఖ పాత్రను పోషించాయని స్థానికులు చెబుతారు. మహాత్మాగాంధీ పిలుపు తో ప్రజలు విదేశీ వస్త్ర బహిష్కరణ చేసి స్థానిక నేత కార్మికులు నేసిన వస్త్రాలను ధరించి ఉద్యమంలో పాల్గొన్నారు. కొత్త ఆవిష్కరణలకు పెద్దాపురం చేనేత కార్మికులు సిద్ధహస్తులు. జాతి పిత మహాత్మా గాంధీ 1929, 1933లో రెండుసార్లు పెద్దాపురంలో పర్యటించారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే పట్టు వస్త్రాలు నాణ్యతను చూసిన గాంధీజీ చాలా ముగ్ధులై దానికి స్వదేశీ పట్టు అనే బిరుదును సైతం ఇచ్చారు.



పెద్దాపురం పట్టుచీరలు

18వ దశకంలో వీవర్స్ సొసైటీ ప్రారంభం...

పెద్దాపురం వీవర్స్ సొసైటీ 18వ దశకంలో ప్రారంభంలో బ్రిటీష్‌వారు స్థాపించిన సమయంలో ముప్పన సోమరాజు ముప్పన వీర్రాజు సోదరులు మల్బరీ సిల్క్ నూలు ఉత్పత్తిని చేయడం ప్రారంభించారు. దీనిని సిల్క్ ట్విస్టింగ్ అని పిలి చేవారు. పెద్దాపురంలో నేత కార్మికులకు ధోతీలను నేయడానికి పంపిణీ చేశారు. మల్బరీ పట్టు నూతుల వెంట్రుకల తీగలా మొత్తగా ఉంటుంది. ఇది నేయడం కష్టంతో కూడుకున్న పని. నేత కార్మికులు వస్త్రం మృదువైన ఆకృతిని పొందడానికి సుమారు ఐదు నుంచి ఆరు సంవత్సరాలు పట్టింది. పెద్దాపురంలో రెండు సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాలు నేత కార్మికులను సిల్క్ ధోతీలు, షర్టింగ్, చీరలు నేయడంలోనే ఉంటారు. పెద్దాపురం చేనేత సొసైటీ సుమారు మూడు నుంచి నాలుగు కోట్ల వార్షిక టర్నోవర్‌తో కొనసాగుతుంది. 1996లోనే పెద్దాపురం సిల్క్ కుప్పడం ఉత్పత్తి ప్రారంభమయ్యింది. అలాగే ధోతీలు బాగా ప్రాచుర్యం పొందాయి. 1977లో సరిహద్దు భాగం నుంచి నూలును తిప్పికొట్టడం, తిప్పడం సులభతరం చేయడం ద్వారా పురోగతిని సాధించాయి. పెద్దాపురం సిల్క్ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించాయి.

అప్పట్లో సంచలనం..

చౌడువాడ ఎస్టేట్ జమిందార్లు, ముప్పన సోదరులు 1913లో పెద్దాపురంలో శ్రీలక్ష్మీ సిల్క్ మాన్యుఫ్యాక్చరింగ్ వర్క్స్ పేరుతో సిల్క్ ఫ్యాక్టరీని స్థాపించారు. అప్పట్లో కొన్ని పరికరాలు జర్మనీ నుంచి దిగుమతి చేసుకుని డీజీ సెట్ల ఉత్పత్తి చేయబడిన వి ద్యుత్తుతో ఫ్యాక్టరీని నడిపేవారు. అప్పట్లో ఇది ఒక సంచలనం. పెద్దాపురం అప్పటికి ఇంకా విద్యుదీకరణ జరగనేలేదు. సుమారు వెయ్యి మంది కార్మికులు ఈ సిల్క్ ఫ్యాక్టరీలో పనిచేసేవారు. కాకినాడ సముద్రం నుంచి చైనా, జపాన్ నుంచి ముడి సరుకుని దిగు మతి చేసుకునేవారు. తయారు చేసిన వస్త్రాలను సిలోన్, బర్మా, సిగపూర్, ఇంగ్లాండ్, తదిర దేశాలకు ఎగుమతి చేసేవారు.

చాలా గర్వించదగ్గ విషయం



పెద్దాపురం సిల్క్‌కు జాతీయస్థాయిలో గుర్తింపు లభించడం చాలా ఆనందంగా ఉంది. ఇది చాలా గర్వించదగ్గ విషయం. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ పథకంలో భాగంగా అవార్డు లభించింది. జాతీయ స్థాయిలో పెద్దాపురం సిల్క్‌కు గుర్తింపు రావడం ద్వారా చేనేత కుటుంబాల జీవన ప్రమాణాలు సైతం మెరుగు పడతాయి.

కె.పెద్దిరాజు, అసిస్టెంట్ డైరెక్టర్
జిల్లా చేనేత, జౌళిశాఖ, కాకినాడ

ఎట్టకేలకు...
సత్యదేవుడి సన్నిధిలో ప్రసాద్ స్కీం పనులకు టెండర్లు ఖరారు

అన్నవరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో కేంద్రప్రభుత్వ నిధు లతో నిర్మించనున్న ప్రసాద్ స్కీం పనుల టెం డర్లు ఎట్టకేలకు ఖరారయ్యాయి. రూ.18.98 కోట్లతో ఈ పనులకు టెండర్లు పిలవగా రాజ మహేంద్రవరానికి చెందిన ఒక గుత్తేదారు 3.65 శాతం లెస్‌కు కోడ్‌చేయడంతో దానిని ఆ మోదించినట్టు టూరిజంశాఖ అధికారులు తె లిపారు. గతేడాది ఎన్నికలకు ముందు ప్రధాని మోదీ ఈ పనులను జమ్మూ, కాశ్మీర్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించినా పలు కారణాలతో పిలిచిన టెండర్లు రద్దు చేశారు. ఈ నిధులతో టీటీడీ సత్రం కూల్చిన ప్రదేశంలో అన్నదాన భవనం, క్యూకాంప్లెక్స్, అధునాతనమైన మరు గుదొడ్లు, రెండు ఎలక్ట్రికల్ బస్సులు సమకూర నున్నాయి. ప్రధానంగా అన్నవరం దేవస్థా నంలో పూర్తిస్థాయిలో అన్నదాన భవనం లేక పోవడంతో భక్తులు అసంతృప్తి చెందుతున్నా రు. పనులు వేగంగా పూర్తయితే సత్యదేవుడి సన్నిధిలో ఉచిత అన్నదానం కష్టాలు గట్టెక్క నున్నాయి. ఈనెలాఖరు లేదా వచ్చేనెల మొద టివారంలో పనులు ప్రారంభించేందుకు పర్యా టకశాఖ అధికారులు సిద్ధం అవుతున్నారు.

చోరీ కేసుల్లో ఐదుగురి అరెస్ట్
రూ.17.50 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం



సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న కాకినాడ డీఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్

కాకినాడ రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో చోరీలకు పాల్పడుతున్న ఐదుగురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.17.50 లక్షల విలువచేసే 135 గ్రాము ల బంగారు ఆభరణాలు, 1567 గ్రాముల వెండి ఆభరణాలు, పల్సర్ మోటార్ సైకిల్‌ను స్వాధీ నం చేసుకున్నట్టు కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్ తెలిపారు. కాకినాడ డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణతో కలిసి చోరీలకు సంబంధిం చిన వివరాలను వెల్లడించారు. 5 కేసుల్లో నింది తులైన కాకినాడ జగన్నాధపురం సత్యదేవనగర్ ప్రాంతానికి చెందిన గంపల సతీష్, యానాం బాలయోగి నగర్ ప్రాంతానికి చెందిన మల్లాడి దుర్గాప్రసాద్, కాకినాడ గొడారిగుంటకు చెందిన కాలాడి అర్జునరావు, బిక్కవోలు మండలం బల భద్రపురానికి చెందిన గొర్రిపూడి వెంకటరమణ ను అరెస్టు చేశామన్నారు. అదేవిధంగా కాకినాడ పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెండు కేసుల్లో ఏటిమొగకు చెందిన రేకాడి వెంకటేశ్వర్లును అ రెస్టు చేసినట్టు తెలిపారు. అనంతరం సీఐ చైత న్యకృష్ణ మాట్లాడుతూ ఎవరైనా ఇతరప్రాంతా లకు వెళ్లినప్పుడు దొంగలకు కనిపించే విధంగా బయటిగేటుకు తాళం కప్పలు వేయవద్దని ఎల్ హెచ్ఎంఎస్‌ని ఉపయోగించుకోవాలని సూచిం చారు. సమావేశంలో క్రైం సీఐ వి.కృష్ణ, కాకినాడ పోర్టు సీఐ సునీల్ కుమార్, ఇంద్రపాలెం ఎస్ఐ వీరబాబు పాల్గొనగా నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

తునిలో చోరీ
రూ.10 లక్షల విలువైన బంగారం, రూ.4వేల నగదు అపహరణ



ఇంటిని పరిశీలిస్తున్న క్లూస్ టీం

తుని రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): కాకి నాడ జిల్లా తుని పట్టణంలో చోరీ జరిగింది. రాజా బుల్లిబాబు వీధి సమీపంలోని కోమాకుల వారి వీధిలో నక్కా లోకేష్ ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగలు పడ్డారు. ఇంటి తాళాలు పగల గొట్టి రూ.10 ల క్షల విలువైన బంగారం, రూ.4 వేల నగదు ఎత్తుకెళ్లారని బాధితులు పోలీసు లకు ఫిర్యాదు చేశారు. దీంతో దర్యాప్తు ప్రారంభి ంచారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

జగ్గంపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కాకి నాడ జిల్లా జగ్గంపేట మండలం జె.కొత్తూరు శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి నలు గురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.11, 300 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చే శామని సీఐ వైఆర్‌కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. పేకాట,బొమ్మ బొరుసు, క్రికెట్ బెట్టింగ్ వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కోడిపందాలపై పోలీసుల దాడి
20 మంది అరెస్ట్

గోపాలపురం, జూలై14 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మం డలం వెంకటాయపాలెం, దొండపూడి గ్రామ శివారుల్లో రహస్యంగా నిర్వహిస్తు న్న కోడి పందాలపై ఎస్ఐ పీ.మనోహర్ తన సిబ్బందితో సోమవారం దాడి చేశారు. ఎనిమిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3800 నగదు, 2 కోడిపుంజులు, 2 కోడికత్తులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా దొండపూడిలో నిర్వహిస్తున్న కోడిపందాలపై దాడి చేసి 12 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 8020 నగదుతో పాటు 2 కోడిపుం జులు, 2 కోడికత్తులు స్వాధీనం చేసుకున్నా మని పేర్కొన్నారు. రెండు చోట్ల కోడి పందాల్లో పట్టుబడిన 20మందిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరు స్తామని ఎస్ఐ మనోహర్ తెలిపారు.

జీజీహెచ్‌లో విద్యార్థినులపై లైంగిక వేధింపులు..
నిందితులను ఉద్యోగాల నుంచి తొలగించాలి

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ

బాధిత విద్యార్థినులతో సమావేశం



మీడియాతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శైలజ

జీజీహెచ్(కాకినాడ) జూలై 14 (ఆంధ్రజ్యోతి) కాకినాడ రంగరాయ వైద్య కళాశాల అనుబంధ మైన జీజీహెచ్‌లో పారా మెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ల్యాబ్ అటెండె ంట్, టెక్నీషియన్, మరో ఇద్దరిని ఉద్యోగాల నుంచి పూర్తిగా తొలగించేందుకు ప్రభుత్వానికి సూచిస్తామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ తెలిపారు. ఆమె సోమ వారం మధ్యాహ్నం రంగరాయ కళాశాలను సం దర్శించి బాధిత విద్యార్థినులను కలిసి వారి పట్ల అటెండెంట్, టెక్నీషీయన్‌లు పాల్పడిన అకృత్యా లను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు నిర్భ యంగా వివరాలను తెలియజేసేందుకు కళా శాల ఆడిటోరియంలోని ప్రత్యేక గదిలో ఇతరులు ఎవరినీ అనుమతించకుండా బాధిత విద్యార్థిను లతో డాక్టర్ శైలజ ఏకాంత సమావేశం నిర్వహిం చారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్, అధ్యాపకులు, ఇంటర్నల్ కంప్లయింట్స్ కమిటీ సభ్యులతో కూడా సమావేశమై భవిష్యత్తులో వి ద్యార్థినుల పట్ల అనుచిత వ్యవహారాల నిరోధాని కి చేపట్టవల్సిన చర్యలను సూచించారు.

అత్యంత హేయమైన చర్య

అనంతరం శైలజ మీడియాతో మాట్లాడుతూ ఆర్ఎంసీ పారా మెడికల్ విద్యార్థినులపై జరిగిన దురాగతాల పట్ల ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశా రు. చదువుకునేందుకు సుదూర ప్రాంతాల నుం చి వచ్చిన పేద కుటుంబాలకు చెందిన మైనర్ బాలికలు, యువతులు లైంగిక వేధింపులతో మా నసికంగా క్షోభకు గురికావడం బాధాకరమన్నా రు. న్యాయం జరుగుతుందో లేదోనన్న సంశ యం, పరీక్షలో ఫెయిల్ చేస్తారేమో, శిక్షణలో ఇ బ్బందులు కలిగిస్తారేమోనన్న భయాలతో వేధిం పులకు గురైన విద్యార్థినులు, ఉద్యోగినులు పై అధికారులకు ఫిర్యాదు చేయకుండా మౌనంగా వారిలో వారే కుమిలిపోతున్నారన్నారు. తమ ప ట్ల జరిగిన ఆకృత్యాలు మరొకరికి జరగకూడదని ధైర్యంగా ఫిర్యాదు చేసిన బాధిత విద్యార్థినులను చైర్‌పర్సన్ ప్రత్యేకంగా అభినందించారు. కళాశా లకు అనుబంధంగా జీజీహెచ్‌లో పనిచేస్తున్న ల్యాబ్ అసిస్టెంట్ కళ్యాణ్‌చక్రవర్తి, టెక్నీషియన్‌లు బి.జిమ్మిరాజు, ప్రసాద్, గోపాల్‌కృష్ణ జుగుప్సాకర మైన రీతిలో విద్యార్థినుల ఫోటోలు తీసి వన్‌టై మ్ యూజ్ మోడ్‌లో మెసేజ్‌లుగా పంపి పైశా చిక ఆనందం పొందుతూ మానసిక వేదనకు గు రి చేయడం అత్యంత హేయమైన చర్య అన్నారు.

విచారణలో విస్తుపోయే నిజాలు

అలాగే నలుగురు నిందితులపై విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయన్నారు. ఆ నలుగురు గతంలో కూడా జీజీహెచ్‌కు వచ్చే మ హిళా రోగులు, వారి బంధువుల పట్ల లైంగిక వే ధింపులకు పాల్పడేవారని విద్యార్థినులు తనకు వివరించారన్నారు. దీనిపై 60మంది విద్యార్థిను లు ఈ నెల 8న బయోకెమిస్ట్రీ విభాగాధిపతికి ఫిర్యాదు చేసి 9వ తేదీన ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డా క్టర్ విష్ణువర్ధన్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశా రన్నారు. ఈ ఫిర్యాదులపై కళాశాల ఇంటర్నల్ కంప్లయింట్స్ కమిటీ విచారించి కమిటీ సమర్పిం చిన నివేదిక ఆధారంగా నిందితులు నలుగురిని ప్రిన్సిపాల్ సస్పెండ్ చేశారన్నారు. బాధిత విద్యా ర్థినులలో మైనర్‌లు కూడా ఉన్నందున నిందితు లపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశా రన్నారు. నిందితులు తాము రెగ్యులర్ ఉద్యోగుల మని, తమను ఎవరూ ఏమి చేయలేరనే ధీమా తో ఇటువంటి అకృత్యాలకు పాల్పడ్డారని ఇటు వంటి వారందరికి గట్టి హెచ్చరికగా నలుగురిని ఉద్యోగ విధుల నుంచి పూర్తిగా తొలగించాలని మహిళా కమిషనర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతుం దన్నారు. బాధిత విద్యార్థినులను కళాశాలలో, జీజీహెచ్‌లో అధికారులు లేదా సిబ్బంది ఎవ రైనా టార్గెట్ చేసే ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణా మాలు ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరిం చారు. మహిళల రక్షణకు కళాశాలలు, కార్యాల యాలలో ఏర్పాటు చేసిన ఇంటర్నల్ కంప్లయి ంట్స్ కమిటీపై విద్యార్థినులకు, ఉద్యోగినులకు అవగాహన కల్పించి వారిలో ధైర్యంతో పాటు భరోసా కల్పించాలని చైర్‌పర్సన్ అధికారులను కోరారు. తమ పట్ల జరిగే లైంగిక అకృత్యాలను ఎదురించే ధైర్యాన్ని ఆడబిడ్డల్లో తల్లిదండ్రులు పె ంపొందించాలని డాక్టర్ శైలజ కోరారు. అనం తరం సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, కాకినాడ ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్ పాటిల్, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్, ఐసీడీఎస్ పీడీ సీహెచ్‌ఎస్‌కే దుర్గాదేవి, జీజీహెచ్ సూపరిండెం టెంట్ డాక్టర్ లావణ్యకుమారి, అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, డిప్యూటీ సూపరిండెంటెంట్ డాక్టర్ పద్మ నాభన్ శ్రీనివాసన్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఏపీఎస్సీహెచ్ఈ ఆదేశాలతో తనిఖీలు
జేఎన్టీయూకే ఇన్‌చార్జి రిజిస్ట్రార్ శీనివాసరావు

జేఎన్టీయూకే, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో ఏపీఎస్సీహెచ్ఈ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టడం జరిగిందని ఇన్‌చార్జి రిజి స్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. నిజ నిర్ధా రణ కమిటీ(ఎఫ్ఎఫ్‌సీ) సిఫార్సుల మేరకు 20 25-26 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్‌లో సుమారుగా 62,000 సీట్లు అందుబాటులో ఉ ండే అవకాశం ఉందన్నారు. 106 ఇంజనీరింగ్ కళాశాలలకు తనిఖీలు జరిగాయని, ఫార్మ సీలో 34 కళాశాలలకు సుమారుగా 3,950 సీట్లు, 9 ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో 16,068 సీట్లు అందుబాటులో ఉండే అవకాశం ఉంద న్నారు. ఏపీఈఏపీసెట్‌లో వెబ్‌ఆప్షన్ల నమోదు కు ఈనెల 18 వరకూ అవకాశం ఉందన్నారు.

మండెల శ్రీరామమూర్తికి పుత్రికా వియోగం

యానాం, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఏపీ యూడబ్ల్యూజే తూర్పుగోదావరి జిల్లా కన్వీ నర్, రాజమండ్రి ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షుడు మండెల శ్రీరామమూర్తి ప్రథమ కుమార్తె సత్తి తేజస్విని (28) సోమవారం హఠాన్మర ణం చెందారు. తన భర్త సత్తి హరిచంద్ర ప్రసాద్‌తో కలిసి తేజస్విని మోటార్ సైకిల్ పై యానాం వస్తుండగా మార్గమధ్యంలో నీలపల్లి ఎక్సైజ్ చెక్‌పోస్టు సమీపాన స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. మండుటెండలో ప్రయాణం చేసిన ఆమె మంచినీరు తాగు తూ అక్కడే కుప్పకూలిపోయారు. తీవ్ర గుం డెపోటు రావడంతో వెంటనే యానాం ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే తేజ స్విని మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించా రు. కోరింగ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. అంత్యక్రియల నిమిత్తం మృ తదేహాన్ని రాజమండ్రి తరలించారు. శ్రీరామ మూర్తిని పెద్దాపురం ఎమ్మెల్యే ఎన్.చిన రాజప్ప పరామర్శించి సంతాపం తెలిపారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తికి రిమాండ్

కరప, జూలై 14(ఆంధ్రజ్యోతి): వరుసకు మామ అయిన వ్యక్తిపై అల్లుడు కత్తితో దాడి చేసిన ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసిన ట్టు ఎస్ తోట సునీత తెలిపారు. కాకినాడ జి ల్లా కరప గ్రామానికి చెందిన భేరి చంద్రశేఖ ర్ ఆస్తి తగాదాల నేపథ్యంలో సోదరుడి మా వయ్య అమజాల వీరరాఘవపై ఆదివారం మధ్యాహ్నం కత్తితో దాడి చేసి గాయపర్చిన విషయం తెలిసిందే. బాధితుడి ఫిర్యాదు మేర కు హత్యాయత్నం కింద కేసు నమోదు చే సిన కరప పోలీసులు సోమవారం నిందితు డిని అరెస్ట్ చేసి కాకినాడ కోర్టుకు తరలించగా మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు.



నిందితుడిని విచారిస్తున్న కరప ఎస్ఐ

సంస్థాన సత్రం ఇన్‌చార్జి ఈవో మార్పు

నూతన ఈవోగా శివబాబు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పిఠాపురం, జూలై 14 (ఆంధ్ర జ్యోతి): కాకి నాడ జిల్లా పిఠాపురం లోని సంస్థాన సత్రం కార్యనిర్వహ ణాధికారి బాధ్యతల నుంచి నున్న శ్రీరాములును తప్పిస్తూ దేవదాయశాఖ ఆదేశాలు జారీ చేసింది. పిఠాపురం సంస్థానస త్రానికి తొండంగిలో ఉన్న 511 ఎకరాల భూములను కౌలుకు సాగు చేసుకునే హక్కు నిమిత్తం నాలుగుసార్లు వేలం ప్రకటన ఇచ్చి నిర్వహించకుండా నే హాస్యాస్పదమైన కారణా లతో అర్థాంతరంగా వాయిదా వేయడం, గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో కౌలుకు పొందిన వారికే మేలు చేసే ందుకే దేవదాయశా ఖాధికారులు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని వివరిస్తూ ఆంధ్రజ్యోతిలో ఐదో సారీ శీర్షికతో సోమవారం వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై దేవదాయశాఖ ఉన్నతాధికారులు సీరి యస్‌గా స్పందించారు. సంస్థానసత్రం ఈవోగా ఉన్న నున్న శ్రీరాములను ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను కుంతీమాధవస్వామి గ్రూపు దేవాలయాలకు పరిమితం చేశారు. సంస్థాన సత్రం ఈవోగా కాకినాడ సమీపంలోని తూరంగేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వ హణాధికారి గెద్దనాపల్లి శివబాబుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. తక్షణం విధుల్లో చేరాలని ఆయనను అధికారులు ఆదేశించారు.

కౌలు వేలం పాటల ప్రారంభం

తొండంగి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నాలు సార్లు వాయిదా పడిన పిఠాపురం సంస్థాన స త్రం భూముల కౌలు వేలం పాటలు ఎట్టకేలకు సోమవారం ప్రారంభమయ్యాయి. తొండంగి రామలింగేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో ఈవో శ్రీరాములు, గ్రేడ్ వన్ ఈవో ఎం.వీరభద్ర రావు, ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్ ఆధ్వర్యంలో పాట లు ప్రారంభించారు. 511.76 ఎకరాల భూమిని బిట్లుగా విభజించి శనివారం వరకూ 6రోజుల పాటు వేలం పాటలు నిర్వహించనున్నారు. మొ దటి రోజు 61.90 ఎకరాలకు మూడేళ్ల కాలానికి వేలం నిర్వహించగా 30మంది రైతులు రూ.5, 94,400కు కౌలును దక్కించుకున్నారు. గతంలో రూ.5,79,300కు పాట వెళ్లగా ఈ ఏడాది రూ. 15,100 పెరిగింది. పిఠాపురం రాజారావు వెంక టమహీపతి రామ రత్నారావు పర్యవేక్షించారు.

రీ అసెస్‌మెంట్ సర్వేలో 60 భవనాలు గుర్తింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సర్పవరం జంక్షన్, జూలై 14 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ రూరల్ మండలంలో 10 వేలు చదరపు అడుగుల విస్తీర్ణం (ఎస్ఎఫ్‌టీ) దాటిన సుమారు 60 భవనాలను గుర్తించడం జరిగినట్టు ప్రభుత్వ మార్గదర్శకాల పంచాయ తీలకు ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకుం టున్నట్టు డిప్యూటీ ఎంపీడీవో శ్రీరామాంజనే యులు తెలిపారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన సక్రమంగా సాగని రీ అసెస్‌మె ంట్ సర్వే కథనంపై ఆయన స్పందించారు. ఇ ప్పటికి గుర్తించిన 60 భవన యాజమానులకు నోటీసులు ఇచ్చేందుకు వీలుగా కమిషనర్‌కు నివేదిక ఇవ్వడం జరుగుతుందన్నారు. అనం తరం సదరు భవన యాజమానులకు పంచా యతీ కార్యదర్శుల ద్వారా నోటీసులు జారీ చేసి, నిబంధనల మేరకు పన్ను సవరణ చేసి ఆస్థి పన్ను కట్టించుకోవడం జరుగుతుంద న్నా రు. తిమ్మాపురంలో 2, రమణయ్యపేటలో 11, వాకలపూడి 6, వలసపాకల తదితర గ్రామా ల్లో 60 భవనాలు గుర్తించామన్నారు. తిమ్మా పురంలో కాలేజీ నిర్వాహకులకు గ్రామ కార్య దర్శి ద్వారా నోటీసు జారీ చేశామని చెప్పారు.

హడలెత్తించిన ఆరడుగుల నాగుపాము

ఉప్పలగుప్తం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం చిన గాడవిల్లి మార్కెట్ వద్ద కళ్యా ణం నరసింహం ఇంటి పెరట్లో కోళ్లగూడులో ఆరడుగుల గోధు మ తాచు పాము ప్రవేశి ంచ డంతో కుటుంబ సభ్యులు హ డలెత్తిపోయారు. స్థానికులు వ చ్చి పామును చూసి భయాం దోళనలకు గురయ్యారు. సమా చారం అందుకున్న భీమనపల్లి కి చెందిన స్నేక్ క్యాచర్ జంప న గణేష్‌వర్మ పామును బం ధించి సురక్షిత ప్రదేశంలో వ దిలాడు. ఆ పాముకు సుమా రు 60 ఏళ్ల వయస్సు ఉంటుం దని గణేష్‌వర్మ తెలిపాడు.



గోధుమతాచును పట్టుకున్న గణేష్‌వర్మ

కొంచెం ఇష్టం కష్టం

ఓ కోతి రాజమహేంద్రవరం పుష్కర్‌ఘాట్ వద్ద దానిని ఆడించే బాలుడిని ఆట పట్టించింది. అంతటితో ఆగకుండా అక్కడికి వచ్చిన కుక్కతో ఆడింది.. అరిచింది. కొట్టింది.. కోపం చూ పింది.. ఆ వెంటనే నువ్వు నేను ఫ్రెండ్స్ అంటూ దానిపై కూర్చుని వెళ్లింది. ఆ చిత్రాలే ఇవి...

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం





పురమిత్ర యాప్‌పై అవగాహన కలిగించాలి

కార్పొరేషన్ పీజీఆర్ఎస్‌లో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): నగర ప్రజలు తమ సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన పురమిత్ర యాప్‌పై ప్రజలకు విస్తృత అవగాహన కలిగించాలని మునిసిపల్ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ సూచించారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి ఆయన 17 అర్జీలు స్వీకరించారు. అలాగే సచివాలయ ఉద్యోగులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ బ్యాన్‌పై కఠినంగా వ్యవహరించాలన్నారు. తల్లికి వందనం పథకం అమలులో ఎదురవుతున్న ఆన్‌లైన్ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజవల్లి, ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరావు, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, మేనేజరు ఎండీ అబ్దుల్ మాలిక్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

ప్రధానోపాధ్యాయులతో సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుభాషిణి



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఏఎంవో సుభాషిణి

రాజానగరం, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయులంతా నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్.సుభాషిని అన్నారు. మండలంలో మల్లంపూడిలోని శ్రీసాయి మాధవి ఇంజనీరింగ్ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నాలుగు రోజుల పాటు జరగనున్న స్కూల్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఏపీసీ సుభాషిణి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, అభ్యసనా సామర్థ్యాలు, ఫైనాన్షియల్ ఎకౌంటెన్సీ పెంపొందించడం, పేరెంట్స్ కమిటీతో నాన్ వైలెన్స్ కమ్యూనికేషన్ చేయడం, పాఠశాల అభివృద్ధికి నాయకత్వం వహించడం, ఉత్తమ లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని టీమ్ వర్క్‌ను పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశ్యమన్నారు. ప్రధానోపాధ్యాయులంతా నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని పాఠశాలలో అభ్యసనా ఫలితాలను, ఎన్‌రోల్‌మెంట్ ఫలితాలు పెంచుకోవాలని సూచించారు. ఈ శిక్షణకు జిల్లా వ్యాప్తంగా 176 మంది ప్రధానోపాధ్యాయులు, తొమ్మిది మంది మాస్టర్ ఫెసిలిటేటర్స్ హాజరైనట్టు చెప్పారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎంవో గౌరీ శంకర్, అనపర్తి ఎంఈవో సత్తిరెడ్డి, శైలజ పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి : ఎస్ఐ

బిక్కవోలు, జూలై 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రగ్స్, సిగరెట్, మందు, జూదాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ సూచించారు. పందలపాక ఉన్నత పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నైతిక విలువలపై అవగాహనా సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను వివరించి వాటిని ఏవిధంగా అధిగమించాలో సూచించారు. సెల్‌ఫోన్‌ను అవసరానికి మాత్రమే వినియోగించాలన్నారు. ఎవరైనా పాఠశాలలోను, వెలుపల శాంతి భద్రతలకు విఘాతం కల్పించినా, అమ్మాయిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్‌వోఎస్ యాప్ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కోనాల సత్తిరాజు, పీడీ డి.యువరాజారెడ్డి, ఎస్‌ఎంసీ సభ్యుడు జక్క వీరభద్రం, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్యకారుల హక్కుల కోసం ఐక్యపోరాటం

మాజీ ఎమ్మెల్సీ ఇందిర



సమావేశంలో మాట్లాడుతున్న సమాఖ్య రాష్ట్రాధ్యక్షుడు అర్జున్

ధవళేశ్వరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని మాజీ ఎమ్మెల్సీ బలసాలి ఇందిర పేర్కొన్నారు. స్థానిక మత్స్య నారాయణమూర్తి భవన్ ప్రాంగణంలో సోమవారం 14 సాంప్రదాయ మత్స్యకార కులాల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఇందిరతోపాటు సమాఖ్య అధ్యక్షుడు నడకుదిటి అర్జున్ ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న వలలు, తెప్పలు, ఇంజన్లు, మోపెడ్‌లు, ఆటోలు, వ్యాన్ల కొనుగోలు కోసం ఇస్తున్న సబ్సిడీని 40నుంచి 70శాతానికి పెంచాలని కోరారు. దీనిపై సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్‌ల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం జిల్లా సమాఖ్య కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. , గౌరవాధ్యక్షుడిగా బలసాలి సత్యాగ్రహ రాజు, ప్రధాన కార్యదర్శిగా జంపా వెంకటరమణ, కోశాధికారిగా పేర్ల దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర నాయకులు అభినందించారు. జిల్లాలో ఉన్న 6 మత్స్యకార కులాల సభ్యులు పాల్గొన్న ఈ సమావేశంలో సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల ముత్యాలు, బి.కాశీ విశ్వనాథ్, కె.గోపి, డి.రమేష్, బలసాడి రంగారావు, ఓలిశెట్టి అప్పలరాజు, అగ్నికుల క్షత్రియ జాలరి, వాడ బలిజ,నెయ్యల, వడ్డి, బేస్త సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు ఇద్దరికి డాక్టరేట్లు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల భౌతికశాస్త్ర విభాగాధిపతి చిన్నం కోమలలక్ష్మి గీతం యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. అలాగే, కెమిస్ట్రీ అధ్యాపకురాలు మంచిరాజు పద్మజకు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. కోమల లక్ష్మి 'గీతం యూనివర్శిటీలో ఫిజిక్స్ విభాగంలో' ప్రొఫెసర్ టి.దుర్గారావు పర్యవేక్షణలో ధన అయాన్లు ప్రతిక్షేపించిన బిస్మత్ ఫెర్రైట్‌ల అయస్కాంత, అనయస్కాంత ధర్మాల పరిశోధనలు అనే అంశంపై లోతైన పరిశోధనలు చేసి పీహెచ్‌డీ డిగ్రీ సాధించారు. కాగా పద్మజ.. 'ఔషధగుణాలు సమృద్ధిగా ఉన్న ఆకేసియా కేసియా మొక్క నుంచి హరిత నానో సంశ్లేషణ చేసిన లోహ ఆక్సైడ్ల యాంటీ ఆక్సిడెంట్, శిలీంధ్ర నిరోధకత, యాంటీ కేన్సర్ జీవ సంబంధ ధర్మాలు' అనే అంశంపై ప్రొఫెసర్ శ్యామల పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామచంద్రరావు, కళాశాల బోర్డు ఆఫ్ రీసెర్చ్ స్టడీస్ కోఆర్డినేటర్ గౌరీనాయుడు, రసాయనశాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీరామ్మూర్తి, సహాయ ప్రిన్సిపాల్ జి.చంద్రశేఖర్, అకడమిక్ కో ఆర్డినేటర్ ఆకెళ్ల రాజేశ్వరి, భౌతిక, రసాయన శాస్త్ర ఇతర అధ్యాపకులు డాక్టరేట్లు సాధించిన కోమల లక్ష్మి, పద్మజలను అభినందించారు.

ఆక్రమణలు తొలగించి ఆయకట్టుకు నీరందించండి

పీజీఆర్ఎస్‌లో రైతుల ఫిర్యాదు

కోరుకొండ, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంబూపట్నం బలరామయ్య చెరువు సాగునీరు సరఫరా చేసే కాలువ ఆక్రమణలు తొలగించి ఆయకట్టుకు నీరందే ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన పలువురు రైతులు సోమవారం రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సోమవారం తాము కలెక్టర్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశామని, అయితే సమస్య పరిష్కరించినట్టు అధికారులు చెప్తున్నారే తప్ప అక్కడ ఎలాంటి పరిష్కారం జరగలేదన్నారు. దీంతో మరలా ఈ విషయాన్ని కలెక్టర్‌కు తెలియజేసేందుకు పీజీఆర్ఎస్‌లో రెండోసారి ఫిర్యాదు చేశామన్నారు. తక్షణం బాలరామయ్య చెరువు తూము ద్వారా ఆయకట్టుకు నీరందించే కాలువ సుమారు 600 మీటర్ల పొడవున ఆక్రమణకు గురైందని, దీని వల్ల రైతులకు సాగు నీరందడం లేదన్నారు. కార్యక్రమంలో నీరుకొండ యుదిష్టర నాగేశ్వరరావు, లక్ష్మి సోమరాజు, తేలు సత్యనారాయణ, ఉల్లి శేషగిరిరావు, చొంగా భజన్నారాయణ, నాగాభాస్కరరావు, తిక్కిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించడం తప్పనిసరి

ధవళేశ్వరం, జూలై 14(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ గణేష్ అవగాహన కల్పించారు. సోమవారం సాయంత్రం కాటన్ బ్యారేజ్ సెంటర్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్ ధరించని వారికి హెల్మెట్ ధారణ వల్ల ఉపయోగాలను వివరించి హెల్మెట్లను కొనుగోలు చేయించారు. ఐఎస్ఐ మార్క్ కలిగిన నాణ్యమైన హెల్మెట్ మాత్రమే రక్షణ కల్పిస్తుందన్నారు. హెల్మెట్ ధరించకపోతే ఫైన్‌లు విధిస్తామని హెచ్చరించారు. వాహనం నడిపేవారు,వెనుక కూర్చున్న వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

శాకంబరిగా దుర్గమ్మ

అనపర్తి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అనపర్తి పరిధిలోని మార్కండేయపురంలోని భావనారుషి ఆలయంలో వేంచేసియున్న దుర్గమ్మ అమ్మవారిని సోమవారం ఆషాఢ మాసం సందర్భంగా శాకంబరి అలంకరణ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని 100 కిలోల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రైతులారా తెలుసుకోండి!
రాయితీలు పొందండి



» ఆయిల్ పామ్ సాగుకు మొక్కలు పూర్తి ఉచితం
» కోకో, కొబ్బరి పండ్లు, కాయ, కూర తోటల సాగుకు సబ్సిడీ
» అంతర పంటలకూ వర్తింపు

రాజానగరం, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఉద్యానశాఖలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రాయితీతో కూడిన వివిధ పథకాలను అర్హులైన రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానశాఖాధికారి అల్లం నాగదేవిశ్రీ పేర్కొన్నారు. ఆత్మ నిర్భర భారత్‌లో భాగంగా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్-ఆయిల్ పామ్(ఎన్ఎంఈవో-ఓపీ) పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ఒక హెక్టారుకు 143 మొక్కలు అవసరమవుతాయని, ఒక మొక్క ఖర్చు రూ.193 కాగా, ప్రభుత్వం నూరు శాతం రాయితీపై అందజేస్తుందన్నారు. మొక్కలు నాటిన నాలుగు సంవత్సరాల్లో మొక్కల మధ్య మొక్కజొన్న, మినుములు, బొప్పాయి, అరటి, కూరగాయలను అంతర పంటలు వేసుకోవచ్చన్నారు. అంతర పంటలకుగానూ ఏడాదికి రూ.5,250 ఒక హెక్టారుకు.. నాలుగు ఏళ్లకు రూ.21 వేలు రాయితీ అందజేస్తున్నామన్నారు. అలాగే ఎరువులు, పురుగు మందులకుగానూ ఏడాదికి రూ.5,250 హెక్టారుకు నాలుగేళ్లకు రూ.21 వేలు రాయితీ అందజేస్తుందన్నారు. కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డ్(సీడీబీ)ద్వారా కొబ్బరి సాగు రైతులకు రాయితీ అందజేస్తుందన్నారు. మిషన్ ఆన్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్(ఎంఐడీహెచ్), రాష్ట్రీయ కృషి వికాస యోజన(ఆర్‌కేవీవై) ద్వారా పండ్ల తోటలైన మామిడి, జీడి మామిడి, బొప్పాయి, జామ, నిమ్మ, టిష్యూ కల్చర్ అరటి, డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరిలో కోకో (ఒక రైతు 5 ఎకరాల వరకు), పూల తోటలు బంతి, గులాబీ, చామంతి, లిల్లీ, మల్లె (ఒక రైతు 2.5 ఎకరాలు వరకు)రాయితీ పొందవచ్చన్నారు. చిన్న, సన్న కారు రైతులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం(ఎన్ఆర్ఈజీఎస్)లో పండ్ల, పూల తోటల విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కూరగాయలు పండించే రైతులు హైబ్రిడ్ కూరగాయల విత్తనం(ఒక ఎకరానికి రూ.1200), హైబ్రిడ్ కూరగాయల పెంపకం(ఒక ఎకరానికి రూ.8 వేలు)వరకు రాయితీ పొందవచ్చన్నారు. తీగ జాతి కూరగాయలు పండించే రైతులు శాశ్వత పందిరిలో వేసుకోవడానికి ఎకరానికి రూ.లక్ష రాయితీ కల్పిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు(ఏపీఎంఐపీ)లో డ్రిప్‌కి చిన్న, సన్న కారు రైతులు ఎస్సీ, ఎస్టీకి చెందిన వారికి (5 ఎకరాల లోపు) నూరు శాతం రాయితీపై రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. చిన్న, సన్న కారు రైతులు ఎస్సీ, ఎస్టీ మినహాయించి 90శాతం రాయితీ(ఐదు ఎకరాల లోపు)రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఐదు నుంచి పది ఎకరాలు కలిగిన రైతులకు 70శాతం రాయితీ, 12.30 ఎకరాలు పైబడిన ఉన్న వారికి 50శాతం రాయితీ అందజేస్తున్నామన్నారు. అలాగే అన్ని వర్గాల వారికి 50శాతం రాయితీపై స్ప్రింక్లర్లు అందిస్తున్నామని, ఈ రాయితీలను రైతులు అందిపుచ్చుకుని వ్యవసాయాన్ని విస్తరించుకోవాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఉద్యానశాఖాధికారి నాగదేవి శ్రీ పేర్కొన్నారు.

రైతుల్లో అవగాహన కల్పిస్తాం



ఉద్యానశాఖ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు అమలు చేస్తున్న రాయితీ పథకాలపై గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించే యోచన ఉంది.నా పరిధిలో రాజానగరం మండలంలో 16 వేల ఎకరాలు, రంగంపేటలో 13 వేలు, బిక్కవోలులో 3 వేలు, అనపర్తిలో 2 వేల ఎకరాల్లో మామిడి, జీడిమామిడి, ఆయిల్ పామ్, నిమ్మ తదితర పంటలు సాగు చేస్తున్నారు. ఆయా పంటలపై ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకునే విధంగా కృషి చేస్తున్నాం.

-అల్లం నాగదేవిశ్రీ, ఉద్యాన శాఖ అధికారి, రాజానగరం.

ఇంటికో మహిళా పారిశ్రామికవేత్త తయారు కావాలి

డీఆర్‌డీఏ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యం నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ సత్యం నాయుడు

రాజానగరం, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఇంటికో మహిళా పారిశ్రామికవేత్తగా తయారు కావాలని డీఆర్‌డీఏ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యం నాయుడు ఆకాంక్షించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ స్వయం సహాయక సంఘాల సభ్యులకు పరిశ్రమల స్థాపనపై రాజానగరంలోని సెర్ప్ కార్యాలయంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వీవోఏ ఒకరు లేదా ఇద్దరు పరిశ్రమలు స్థాపనకు ఆసక్తి కనబరుస్తున్న మహిళలను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. దీనిలో భాగంగా మహిళలు పరిశ్రమల స్థాపనకు కావాల్సిన లాభదాయకమైన వ్యాపారాలు ఎంపిక, రుణ సదుపాయాలకు కావాల్సిన ప్రాజెక్టు రిపోర్ట్, డాక్యుమెంటేషన్ ప్రక్రియ, యంత్ర పరికరాలు, ముడి సరుకు, మార్కెటింగ్ సదుపాయాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ రాయితీ పథకాలు, పరిశ్రమల స్థాపనకు కావాల్సిన వివిధ రిజిస్ట్రేషన్లు, అనుమతులు, రాయితీలు వంటి విషయాలపై మహిళలకు అవగాహన కల్పించారు. అలాగే ముద్ర, ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం, ప్రధాన మంత్రి ఆహార శుద్ధి పరిశ్రమల ప్రోత్సాహక కార్యక్రమం, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక విధానం, స్టాండ్-అప్ ఇండియా కార్యక్రమం తదితర రుణ సదుపాయాల గురించి స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా పీఎంఎఫ్‌ఎంఈ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుకన్య, సడ్బి శ్రీనివాస్, జనార్ధనరావు, ఏపీఎం గుమ్మడి సునీత, హేమంత్, వివిధ బ్యాంకులకు చెందిన మేనేజర్లు, సీసీలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు
12,15,45 డివిజన్లలో సుపరిపాలనలో తొలి అడుగు



కార్యక్రమంలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన పేదలందరికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. ఆయన సోమవారం సాయంత్రం స్థానిక 12, 15, 45వ డివిజన్లలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి, లబ్ధిదారుల అభిప్రాయాలను సేకరించి టీడీపీ యాప్‌లో వారి పొందుపరిచారు. స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వ ప్రజలను నమ్మించి మోసం చేసిందని తమ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలే నెరవేర్చి భరోసా ఇస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, మజ్జి రాంబాబు, ఉప్పులూరి జానకిరామయ్య, కొల్లి బుజ్జి, మొకమాటి సత్యనారాయణ, కొయ్యల రమణ, కిలపర్తి శ్రీను, కొడమళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా స్థానిక తిలక్‌రోడ్డులోని తన కార్యాలయంలో విద్యార్థులకు, వివిధ సమస్యలతో బాధపడుతున్న కార్యకర్తలకు భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందించారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన వాసు

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు సోమవారం కలిశారు. ఆలిండియా స్థాయిలో ఉత్తమ ర్యాంక్ సాధించిన రామ్ కిరిటీని, కె.ప్రణీత, యశ్వంత్ సాత్విక్‌లను తీసుకుని ఎమ్మెల్యే వాసు, తిరుమలరావు..లోకేశ్‌ను కలిసి వారు సాధించిన ర్యాంకుల వివరాలు తెలిపారు. విద్యార్థులను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి అమలు చేయాలి

కలెక్టరేట్ ఎదుట ఏఐవైఎఫ్ ధర్నా.. జేసీకి వినతి



ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు ప్రభుత్వం నిరుద్యోగ భృతి అమలు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.త్రిమూర్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం బొమ్మూరులోని జిల్లా కలెక్టరేట్ ఎదుట ఏఐవైఎఫ్ రాజమహేంద్రవరం సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం జేసీ చిన్నరాముడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 భృతి చెల్లించాలన్నారు. అలాగే, రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వశాఖల్లో ఖాళీగా ఉన్న 2.35 లక్షల ఉద్యోగులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలపై స్పష్టమైన రోడ్‌మ్యాప్ ప్రకటించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ సునీల్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.లావణ్య, యువత తదితరులు పాల్గొన్నారు.

జి.దొంతమూరులో డ్రైనేజీ పూడికతీత పరిశీలన



జి.దొంతమూరులో పూడికతీత పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

రంగంపేట, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.దొంతమూరులో వినాయకుడు గుడి నుంచి ముత్యాలమ్మ గుడి వరకు చేస్తున్న డ్రైనేజీ పూడికతీత పనులను సోమవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఈ గ్రామంలో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో గ్రామస్థులు డ్రైనేజీలో పూడిక తీయకపోవడంపై తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు ఈ డ్రైన్‌ను పూర్తిగా ఆక్రమించుకోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. డ్రైనేజీ పూడికతీత పనులపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముకుందవరంలో 'తొలి అడుగు'

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ముకుందవరంలో టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో గ్రామంలో రూ.8.60 కోట్లతో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామస్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు, టీడీపీ, జనసేన మండలాధ్యక్షులు ఎలుగుబంటి సత్తిబాబు, గిరజాల సత్తిబాబు, నాయకులు అడబాల వెంకట్రావు, కడిమి సాయిబాబు, గుత్తుల సుబ్రహ్మణ్యం, యడ్లగణేష్, వట్టికూటి వెంకన్నబాబు పాల్గొన్నారు.

గోకవరం సహకార సొసైటీ చైర్మన్‌గా సత్తిబాబు



గోకవరం, జూలై 14(ఆంధ్రజ్యోతి): గోకవరం వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిమేన్ కమిటీ చైర్మన్‌గా గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గాజింగం సత్యనారాయణ (సత్తిబాబు) నియమితులయ్యారు. సభ్యులుగా తంటికొండ గ్రామానికి చెందిన మిరియాల శ్రీనివాసరావు(గాంధీ), వెదురుపాక గ్రామానికి చెందిన కొత్తల వీరఅప్పారావు నియమితులయ్యారు. సత్తిబాబు గత వైసీపీ ప్రభుత్వంలో కూడా అదే సొసైటీకి చైర్మన్‌గా వ్యవహరించారు. నూతన త్రిమేన్ కమిటీని కూటమి నాయకులు అభినందించారు.

పేకాడుతున్న పది మంది అరెస్ట్

గోకవరం, జూలై14(ఆంధ్రజ్యోతి): పేకాట శిబిరంపై దాడి చేసి పది మందిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ పవన్‌కుమార్ సోమవారం తెలిపారు. మండలంలోని కృష్ణునిపాలెం పరిధిలోని వెంకటాపురం గ్రామ శివారున చిలక్కొండ వద్ద పేకాట ఆడుతున్నట్టు అందిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. 10 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.7 వేల నగదు, ఆరు మోటారుసైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు.

అశోక గజపతిరాజుకు ఎంపీ పురందేశ్వరి అభినందనలు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా నియమితులైన టీడీపీ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజుకు రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు చేస్తూ, నూతన అధ్యాయాన్ని ప్రారంభిస్తున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. అంకితభావంతో దేశానికి సేవను కొనసాగించాలని కోరుకుంటున్నట్టు పేర్కొన్నారు.

నేటి నుంచి బిక్కవోలులో నేషనల్ లెవెల్ మోనిటరింగ్ బృందాల పర్యటన

బిక్కవోలు, జూలై 14(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు మండలంలో నేషనల్ లెవెల్ మోనిటరింగ్ బృందాలు ఈ నెల 15 నుంచి పర్యటిస్తాయని ఎంపీడీవో వి.శ్రీనివాస్ సోమవారం విలేకర్లకు తెలిపారు. మూడు రోజులపాటు బిక్కవోలు, రంగాపురం, ఆరికరేవుల గ్రామాల్లో పర్యటిస్తారన్నారు. ఈ సందర్భంగా వీరు కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఎన్ఆర్‌జీఈఎస్, డేఎన్ఆర్ఎల్ఎం, డీడీయూ జీకేవై, పీఎంఏవై-జీ, ఎస్ఎస్ఏపీ, పీఎంకేఎస్‌వై, పీఎం జీఎస్‌వై, ఎస్‌పీ జీవై, డీఐఎల్ఆర్ఎంపీ, ఆర్‌పీఎస్ఈటీఐ, ఎస్‌వీపీ ఎంఐటీవీపీ అమలు తీరును పరిశీలిస్తారన్నారు.

కడియం ఉద్యాన శాఖ అధికారిగా లావణ్య



కడియం, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండల ఉద్యానశాఖ అధికారిగా పి.లావణ్య బాధ్యతలు స్వీకరించారు. జగ్గంపేట నుంచి కడియం బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ నూతన నర్సరీల ఏర్పాటుకు రైతులు లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలని, ఇప్పటికే లైసెన్సు ఉంటే రెన్యూవల్ చేయించుకోవాలని తెలిపారు.

కడియం డిప్యూటీ ఎంపీడీవోగా శ్రీనివాస్



కడియం, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండల డిప్యూటీ ఎంపీడీవోగా ఎస్.శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. అమలాపురం డివిజనల్ పంచాయతీ ఇంజనీరింగ్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతిపై కడియం వచ్చి బాధ్యతలు చేపట్టారు.

మురమండ సొసైటీ చైర్మన్ జానకిరామ్‌కు అభినందన

కడియం, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురమండ ప్రాథమిక సహకార పరపతి సంఘం చైర్మన్‌గా ఎంపికైన వట్టికూటి జానకిరామయ్య(దత్తుడు)ను సోమవారం గ్రామ టీడీపీ యువత సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో దేవళ్ల రామ్మోహనరావు, పోతుల సత్యనారాయణ, నల్లూరి రామకృష్ణ, గారపాటి సురేంద్ర, గన్ని రామారావు, గారపాటి వంశీ, నరేంద్ర పాల్గొన్నారు.

భగవద్గీత గ్రంధ ప్రచారం



కడియం, జూలై 14(ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక రాజమహేంద్రవరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం కడియంలో భగవద్గీత గ్రంథ ప్రచారం జరగింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శేఖర్‌బాబు, మూర్తి, లక్ష్మీనారాయణ, జైరామ్, గోవిందు, విజయ్, సంధ్యారాణి, సూర్యకుమార్ తదితరులున్నారు.

సినిమా గైడ్


(రాజమహేంద్రవరం)

శ్యామల	: ఓ భామ అయ్యో రామ
సూర్యమినీ	: ఎఫ్1 ది మూవీ, 3బిహెచ్‌కే
సూర్యప్యాలస్	: జురాసిక్ వరల్డ్, డి-100
స్వామి	: కుబేర
శివజ్యోతి	: తమ్ముడు
అనుశ్రీ(సాయికృష్ణ)	: సూపర్‌మేన్
రాజా	: సూపర్‌మేన్
ఊర్వశి	: మిరపకాయ్, కుమారి 21ఎఫ్
రంభ	: మార్గన్
మేనక	: జురాసిక్ వరల్డ్
అప్సర	: సూపర్‌మేన్
కుమారి	: ----
అశోక	: సూపర్‌మేన్
వీఎస్ మహల్(నామవరం)	: సూపర్‌మేన్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: సూపర్‌మేన్
వెంకటసూర్య(కడియం)	: సూపర్‌మేన్
సత్యగౌరి (అనపర్తి)	: ఓ భామ అయ్యో రామ
సూర్యశ్రీ (అనపర్తి)	: కుమారి 21ఎఫ్
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: సూపర్‌మేన్
రామకృష్ణ(కోరుకొండ)	: ఏస్
గీతాసినిమాస్ (సీతానగరం)	: తమ్ముడు
శ్రీనివాస (గోకవరం)	: సూపర్‌మేన్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: కుమారి 21ఎఫ్
లలితామహల్(రంపచోడవరం)	: తమ్ముడు
నవయుగ(చింతూరు)	: తమ్ముడు



ఆకట్టుకున్న..సిల్క్ చీర!

ఎప్పుడో బ్రిటీష్ కాలం నాటి రోజుల్లో పెద్దాపురం సిల్క్ పట్టుచీరలకు ఎంతో ప్రసిద్ధి చెందింది. ఆ రోజుల్లో అంటే 1913లో పెద్దాపురంలో శ్రీలక్ష్మీ సిల్క్ మాన్యుఫ్యాక్చరింగ్ వర్క్స్ పేరుతో ఓ పెద్ద సిల్క్ ఫ్యాక్టరీయే ఉండేది. దేశంలోనే నాణ్యమైన వస్త్రాలకు ఇక్కడ పెట్టింది పేరు. సిల్క్ పట్టు చీరలకు, పంచెలకు కేరాఫ్‌గా మారింది. తర్వాత శ్రీలక్ష్మీ సిల్క్ ఫ్యాక్టరీ మూడు దశాబ్దాల కిందటే మూతపడింది. కానీ పట్టు వస్త్రాల తయారీ మాత్రం ఇప్పటికీ కొనసాగుతోంది. నాణ్యతకు పెట్టింది పేరుగా ఉన్న పెద్దాపురం సిల్క్ పట్టు చీరలకు ఇప్పుడు జాతీయ అవార్డు లభించింది. కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం ఢిల్లీలో వన్ డ్రిస్టిక్ట్ వన్ ప్రొడక్ట్ పథకం కింద ఈ అవార్డు అందుకున్నారు..



1913లో స్థాపించిన పెద్దాపురం సిల్క్ ఫ్యాక్టరీ



అవార్డు అందుకుంటున్న కలెక్టర్

గోదావరి వరద తగ్గుముఖం



ధవళేశ్వరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం వద్ద గోదావరి వరద ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. దీంతో కాటన్ బ్యారేజ్ గేట్లను కిందకు దించి నీటి విడుదలను నియంత్రిస్తున్నారు. సోమవారం సాయంత్రం ధవళేశ్వరం ఆర్మ్‌లోని మొత్తం గేట్లను ఒక మీటరు మేర, ర్యాలీ, మద్దూరు, విజ్జేశ్వర ఆర్మ్‌లలో మొత్తం గేట్లను 0.60మీటర్ల మేర పైకి ఎత్తి 3,58,900 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో నీటిమట్టం 10.50 అడుగులుగా నమోదైంది. ఎగువున భద్రాచలం వద్ద క్రమంగా తగ్గుతున్న నీటిమట్టం 23 అడుగులకు చేరుకుంది. వ్యవసాయ అవసరాలకు డెల్టా కాలువలకు నీటి విడుదలను పెంచారు. తూర్పు డెల్టాకు 5వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2600 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 6800 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు.



చెత్తగించారు!

విద్యుత్ ప్లాంట్ కేరాఫ్ రామేశంమెట్ట?

చెత్త కనిపించదంతే..

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీలు కలిపి 11 వరకు ఉన్నాయి. వీటి పరిధిలో రోజూ భారీగా చెత్త పోగవుతోంది. నిత్యం ఈ చెత్తంతా మునిసిపల్ సిబ్బంది నగరాలు, పట్టణాలకు దూరంగా డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు.ఈ మేరకు వందల కొద్దీ వాహనాలు, ఉద్యోగులు అవసరమవుతున్నారు. ఇలా పోగవుతున్న చెత్తతో డంపింగ్‌యార్డులు చిన్నపాటి కొండలను తలపిస్తున్నాయి. ప్రభుత్వం ఆ చెత్తం టిని ఒక చోటకు తరలించి విద్యుదుత్పత్తిని చేపట్టేలా కొత్త ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్రాజెక్టు రూ.370 కోట్లతో పట్టాలెక్కించాలని నిర్ణయించింది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.370 కోట్లతో నిర్మించనున్న చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్రాజెక్టు గాల్లో పడింది. తొలుత ఖరారు చేసిన తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం బలబద్రపురంలో ప్రాజెక్టు రద్దయిపోయింది. బలబద్రపురంలో ఇప్పటికే గ్రాసిం కాలుష్యంతో ప్రజలు ఇబ్బంది పడు తున్న నేపథ్యంలో విద్యుత్ తయారీ ప్రాజెక్టును స్థానిక ఎమ్మెల్యే నల్లమిల్లి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అటు మునిసిపల్ మంత్రికి ఇప్పటికే తన అభ్యంతరాలు వివరించారు. దీంతో బలబద్రపురంలో ప్రాజెక్టు ఉపసంహరించుకోవాలని అధికారులు నిర్ణయించారు.ఈ ప్రాజెక్టుకు కాకినాడ జిల్లా పెద్దాపురం పెద్దాపురం రామేశంమెట్ట అనువు గా ఉంటుందని భావిస్తున్నారు.ఎమ్మెల్యే రాజప్ప సైతం ఇక్కడ దీని ఏర్పాటుకు సుముఖంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడే విద్యుత్ తయారీ ప్రాజెక్టు ఏర్పాటుకు అధికారులు మొగ్గు చూపుతున్నారు. దీంతో మునిసిపల్ మంత్రి నారాయణ,కాకినాడ జిల్లా కలెక్టర్ కలిసి నేడో,రేపో దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

13 నగరాలు.. వెయ్యి టన్నుల చెత్త

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 11 మునిసిపాలిటీలతో పాటు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని మరో 11 కార్పొరేషన్లు, మునిసిపాలిటీలను కలిపి కాకినాడ- రాజమహేంద్రవరం క్లస్టర్‌గా ప్రభుత్వం ప్రతిపాదించింది. ఉమ్మడి తూర్పు, ఉమ్మడి పశ్చిమలో కలిపి రోజుకు 950 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతున్నట్టు లెక్కలు కట్టింది.అత్యధికంగా ఉమ్మడి తూర్పు పరిధిలోని కాకినాడ కార్పొరేషన్‌లో రోజుకు 144 టన్నులు, రాజమహేంద్రవరం కార్పొరేషన్ 160, పిఠాపురం 26, పెద్దాపురం 25, సామర్లకోట 23, రామచంద్రపురం 23, మండపేట 26, ముమ్మిడివరం 11, అమలాపురం 30, నిడదవోలు 22, కొవ్వూరు 26 మునిసిపాలిటీల పరిధిలో దాదాపుగా 30 టన్నుల చొప్పున చెత్త రోజువారీ వస్తోంది. ఈ చెత్తంటిని ఒక చోటకు చేర్చి రోజుకు 12 మెగావాట్ల వరకు విద్యుదుత్పత్తి చేయవచ్చని తేల్చారు.12 మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్లాంట్‌కు రూ.370 కోట్ల వరకు ఖర్చవుతుండగా ప్రభుత్వం పైసా పెట్టుబడి పెట్టకుండా ప్రైవేటు కంపెనీయే భరించేలా ఇటీవల నిర్ణయం తీసుకుంది. చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేసే కంపెనీయే ఈ మొత్తం భరించేలా టెండర్లు పిలిచింది. ఎంపికైన సంస్థ ఈ మొత్తం భరిస్తే ప్రభుత్వం తరఫున చెత్త ఇవ్వడం, ఉత్పత్తయిన విద్యుత్ 25 ఏళ్ల పాటు సదరు కంపెనీయే సొంతంగా విక్రయించుకునే వెసులుబాటు కల్పించింది.ఒక రకంగా చెప్పాలంటే ప్రభుత్వానికి భారం లేకుండా రెండు కార్పొరేషన్లు, తొమ్మిది మునిసిపాలిటీల్లో చెత్తంతా బయటకు వెళ్లిపోనుంది.

తొలుత బలభద్రపురమే కానీ..

ఈ ప్రాజెక్టుకు అత్యంత అనువైన ప్రాంతంగా మూడు నెలల కిందట అనపర్తి నియోజకవర్గాన్ని గుర్తించారు. బిక్కవోలులో 12 ఎకరాలు, బలబద్రపురంలో 20 ఎకరాలను అధికారులు

- రూ.370 కోట్లతో విద్యుత్ ప్లాంట్
- ఎమ్మెల్యే, జనం నుంచి వ్యతిరేకత
- మంత్రి నారాయణతోను చర్చ
- టెండర్లలో మినహాయింపు
- బలభద్రపురంలో ప్రాజెక్టు రద్దు
- తాజాగా రామేశంమెట్ట పరిశీలన
- నేడు మంత్రి నారాయణ రాక
- ఖరారుకానున్న తుది ప్రాంతం
- ఊపిరిపీల్చుకున్న ప్రజానీకం

ఎంపిక చేశారు. 12 ఎకరాల్లో విద్యుత్‌ప్లాంట్, 20 ఎకరాల్లో తెచ్చిన చెత్తంతా పోగుచేసి విద్యుత్ ఉత్పత్తికి అనువుగా మార్చడానికి ప్రాజెక్టును సిద్ధం చేశారు.మంత్రి నారాయణ సైతం స్థలాన్ని పరిశీలించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి చెత్తను తెచ్చి బలబద్రపురంలో స్టాక్ చేయడం కోసం అనువుగా ఉందని గుర్తించారు. ఇక్కడ చెత్త నుంచి తయారయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానించుకునేందుకు వీలుగా విద్యుత్ లైన్ ఉండడంతో ప్రాజెక్టు ఇక్కడే అని ఖాయం చేసేశారు. దీనిపై స్థానిక ప్రజల నుంచి, అటు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. చెత్తంతా తెచ్చి ఇక్కడ పోగేస్తే జనం ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుందని..నిత్యం ఊరుచుట్టూ వందల్లో చెత్త లారీలు తిరిగితే జనం నానా ఇబ్బందులు పడతారని మంత్రి నారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. ఇప్పటికే గ్రాసిం పరిశ్రమ కాలుష్యంతో నరకయాతన పడుతున్న జనానికి ఇది మరో తీవ్ర ముప్పవుతుందని వివరించారు. మరో పక్క చెత్త నుంచి విద్యుదుత్పత్తి ప్లాంట్ తమ ప్రాంతంలో వద్దంటూ బిక్కవోలు, బలబద్రపురం పంచాయతీలు ఏకగ్రీవ తీర్మానం చేశాయి. దీంతో ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

రామేశంమెట్ట వైపు చూపు

ఇటీవల ప్రభుత్వం ఈ తరహా ప్రాజెక్టుకు టెండర్లు పిలిచింది. ఇందులో బలబద్రపురం ప్రాజెక్టును ప్రజావ్యతిరేకత నేపథ్యంలో తప్పించారు. ప్రత్యామ్నాయంగా పెద్దాపురం రామేశం మెట్ట వైపు మొగ్గుచూపుతున్నారు. ఇది జనావా సాలకు దూరంగా ఉండడం, ఇక్కడ వందలాది ఎకరాల్లో కొండలను తవ్వి గోతులుగా మార్చిన నేపథ్యంలో ప్రాజెక్టు ఏర్పాటు చేసినా ఇబ్బంది ఉండదని అధికారులు భావిస్తున్నారు.ఎమ్మెల్యే రాజప్ప సైతం సుముఖంగా ఉన్నారు.దీంతో ఇక్కడే దాదాపుగా ప్రాజెక్టు ఖాయం అయ్యే అవకాశం ఉంది.ఈ ప్రాజెక్టును కాకినాడ- రాజమహేంద్ర వరం క్లస్టర్ కింద ప్రతిపాదించారు. నేడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నారా యణ పెద్దాపురం నియోజకవర్గంలో తొలి అడుగు కార్యక్రమం కోసం వస్తున్నారు. చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్రా జెక్టుకు ఇక్కడ భూములు పరిశీలించనున్నారు.ఆ తర్వాత కలెక్టర్‌తో చర్చించి ఖరారు చేయనున్నారు.

రేపటి నుంచి మునిసిపల్ కార్మికుల సమ్మె

కొవ్వూరులో కమిషనర్‌కు నోటీస్

కొవ్వూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : డిమాండ్ల సాధనకు మునిసిపల్ కార్మికులు సమ్మెకు దిగనున్నారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కొవ్వూరు మునిసిపల్ కమిషనర్ సందీప్‌కు పారిశుధ్య కార్మికులు సమ్మె నోటీసు అందించారు. కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ ఆప్కాస్ స్థానంలో ప్రైవేటు ఏజెన్సీలకు అధికారం ఇవ్వాలనే ప్రతిపాదనలు ఉపసంహరించాలన్నారు. పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, వయో పరిమితి 62 ఏళ్లకు పెంచాలని, 17 రోజుల సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఎక్స్‌గ్రేషియా 5 లక్షల నుంచి 7 లక్షలకు పెంచాలని, దహన సంస్కారాలకు రూ. 20 వేలు అందించాలని డిమాండ్ చేశారు. మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు జీవో నంబరు 26 ప్రకారం ఆదాయపరిమితితో సంబంధం లేకుండా పథకం వర్తిస్తుందని ప్రకటించినప్పటికీ కొవ్వూరు పురపాలక సంఘంలో అమలు కాలేదన్నారు.లోపాలను సరిదిద్ది తక్షణం తల్లికి వందనం అమలుచేయాలని డిమాండ్ చేస్తూ జూలై 16 నుంచి మునిసిపల్ కార్మికుల సమ్మె చేపడుతున్నట్టు నోటీసు అందించారు.కార్యక్రమంలో ఎం.సుందరబాబు, భూపతి రవీంద్ర, పి.వాసు, కళ్యాణి రాజేష్, రాజాన అప్పారావు, ఎం.కిషోర్, మీసాల జ్యోతి పాల్గొన్నారు.



కొవ్వూరు మునిసిపల్ కమిషనర్ సందీప్‌కు సమ్మెనోటీసు అందిస్తున్న కార్మికులు



జన సైనికులతో మాట్లాడుతున్న జనసేన రాష్ట్ర కార్యదర్శి శివశంకర్

కొవ్వూరులో ఏం జరుగుతోంది?

జనసేన రాష్ట్ర జనరల్ సెక్రటరీ తమ్మిరెడ్డి శివశంకర్ విచారణ

కొవ్వూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు నియోజకవర్గ జనసైనికులతో జనసేన రాష్ట్ర జనరల్ సెక్రటరీ తమ్మిరెడ్డి శివ శంకర్ సమావేశమయ్యారు. ఇటీవల జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ.రామారావు నియోజకవర్గంలో జనసేన కార్యకర్తలకు గౌరవం లభించడం లేదని, రోడ్డు కం రైలు వంతెన టోల్‌గేటు వద్ద నిరసన దర్నా చేపట్టారు. దీంతో పార్టీ అధిష్ఠానం కూటమి స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్నారని టీవీ.రామారావుని ఇన్‌చార్జి పదవి నుంచి తప్పించారు. జనసేన పార్టీ సోషల్ మీడియాలో కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో కొవ్వూరు నియోజకవర్గంలో నెలకొన్న పరిణామాలపై విచారించి నివేదిక ఇవ్వాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్‌ను జనసేనాని పవన్‌కల్యాణ్ సూచించారు. ఈ మేరకు సోమవారం కొవ్వూరు జనసేన పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో శివశంకర్ సమావేశమయ్యారు. అనంతరం మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ సభ్యులు,సీనియర్ నాయకులతో సమావేశమై ఆరా తీశారు.



సమస్య వింటున్న కలెక్టర్ ప్రశాంతి

పీజీఆర్ఎస్‌లో 238 అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్ జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలు సత్వర పరిష్కారం చూపేవిధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ ప్రశాంతి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జేసీ, ఇతర అధికారులతో కలిసి 238 అర్జీలను స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఐవీఆర్ఎస్‌ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వ భూమిలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ల ద్వారా ఇంజక్షన్ కోసం 37 మంది పేదలను కోర్టు చుట్టూ తిప్పుతూ మానసికంగా,ఆర్థికంగా ఇబ్బందులు పెడుతున్న కేసుల్లో ప్రభుత్వం వారు ఇంప్లీడ్ పిటిషన్ వేసి తమకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం వద్ద అఖిల భారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 36 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్‌ని నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వచ్చిన ప్రజల నుంచి అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ(అడ్మిన్), ఏవీ సుబ్బరాజు (లా అండ్ ఆర్డర్) 36 ఫిర్యాదులను స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి సమస్యపై ఆరా తీశారు. చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆదేశిస్తూ సంబంధిత అధికారులకు ఫిర్యాదులను పంపించారు.



రాజమహేంద్రవరంలో రివర్ ఫ్రంట్ పనులు

సమయం లేదు.. మిత్రమా!

ఆరంభం కాని పుష్కర పనులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

గోదావరి పుష్కరాలు 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకూ నిర్వహించనున్నారు. రోజులు తరుగుతున్నాయి. ఇంకా రెండేళ్ల సమయం మాత్రమే ఉంది. కానీ చేయాల్సిన పనులు మాత్రం బోలెడు ఉన్నాయి. గత పుష్కరాలను అప్పటి టీడీపీ ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. సుమారు 5 కోట్ల మంది జనం పుణ్యస్నానాలు ఆచరించారు. ఇప్పుడు ఆ సంఖ్య 10 కోట్లు ఉంటుందని అంచనా.కానీ పనులు మాత్రం ఇంకా కాగితాలపై ఉన్నాయి. ఇప్పటికే ఇద్దరు ప్రత్యేక అధికారులను నియమించినా వాళ్లు ఇంకా ఆ విధులకు ఓంకారం చుట్టలేదు. రాష్ట్ర ప్రభుత్వం 12 మందితో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది.అది కూడా పనిలోకి దిగాల్సి ఉంది.పుష్కర పనులకు శ్రీకారం ఎప్పుడా అని గోదారమ్మ ఎదురు చూస్తోంది.

నిధుల వరద కాగితాల్లోనే..

అన్ని శాఖలు ఇప్పటికే తమ ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించాయి. ముసాయిదా ప్లాన్ సిద్ధమైంది. ఏపీలోని గోదావరి పరీవాహక ప్రాంతంలోని సుమారు 20 ప్రధాన ఘాట్లలో రోజుకు లక్ష మంది వరకూ పుణ్యస్నానాలు ఆచరిస్తారని అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకూ పర్యాటక, దేవాదయ, జల వనరులు, రెవెన్యూ, మునిసిపల్ శాఖలు మాత్రం పలు సమీక్షలు నిర్వహించాయి. పుష్కర భక్తులకు బస, రవాణా ఏర్పాట్లతో పాటు ఇప్పటికే రాజమహేంద్రవరంలో ఉన్న ఘాట్లకు అదనంగా మరో 4 నిర్మించాలని నిర్ణయించారు.వీటికి రూ.900 కోట్లతో, మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో రోడ్లకు రూ.460 కోట్లు,ఆర్‌అండ్‌బీ ద్వారా రూ.680 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు.మొత్తంగా సుమారు రూ.3 వేల కోట్లు ఖర్చవుతుందని ప్రాథమిక అంచనా వేస్తుండగా.. ఇప్పటికి కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించింది.ఇటీవల అఖండ గోదావరి ప్రాజె క్టు పనులు రూ.100 కోట్ల అంచనాతో ప్రారం భించారు.రివర్‌ఫ్రంట్ పనులు జరుగుతున్నాయి. మిగిలిన పనులకు కొబ్బరి కాయలు కొట్టలేదు.

డివిజన్ల వారీగా ప్రతిపాదనలు..

2015లో టీడీపీ ప్రభుత్వ హయాంలో పుష్కరాలు నిర్వహించారు. అప్పట్లో రాజమహేంద్రవరంలోని ఘాట్ల అభివృద్ధి తదితర ఏర్పాట్లకు రూ.200 కోట్లు విడుదల చేశారు. ప్రస్తుత మార్కెట్ రేట్ల ప్రకారం ఇప్పుడు ఆ బడ్జెట్ గణనీయంగా పెరగనుంది.రాజమహేంద్రవరం మునిసిపాలిటీకి ప్రత్యేకంగా,మిగతా శాఖలకు ఆయా రెవెన్యూ డివిజన్ల కింద నిధులు విడుదల చేయాలని ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. రెండు రెవెన్యూ డివిజన్లకు రూ.1400 కోట్లతో అంచనాలు రూపొందించగా.. మరోవైపు నగరపాలక సంస్థ ఇప్పటికే 1587.80 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది.రాజమహేంద్రవరం డివిజన్‌లో దాదాపు 550 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం, మరమ్మతులు, విస్తరణ చేయడానికి రూ.400 కోట్లు అవసరత చూపించారు.కొవ్వూరు డివిజన్‌కు సంబంధించి రూ.250 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేశారు. ఘాట్లకు వెళ్లే రహదారులు, ప్రధాన, పార్కింగ్ ప్రాంతాలకు..ఇలా నాలుగు విభాగాలుగా రహదా రుల అంచనాలు..రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు తదితర నియోజకవర్గాల్లో ఘాట్ల అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించారు.

గతం కంటే మెరుగ్గా

గత పుష్కరాలకు రాజమహేంద్రవరంలోని కోటిలింగాల ఘాట్‌ను 1.5 కిలోమీటర్ల నిడివితో నిర్మించారు. మిగతా ఘాట్లను కూడా అభివృద్ధి చేశారు. ఇప్పుడు వాటికి ఏమైనా మరమ్మతులు ఉంటే చేయడంతో పాటు కొత్తవి కూడా నిర్మిస్తారు. కోటిలింగాల ఘాట్ నుంచి పుష్కరాల రేవు గుండా వీఐపీ ఘాట్ వరకూ ఒకే ఘాట్ నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. నిడద వోలు, కొవ్వూరు,తాళ్లపూడి మండలాల్లో 29 ఘాట్లకు మరమ్మతులు,4 కొత్త వాటికి రూ.100 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు. రాజమహేంద్రవరం రూరల్, సీతానగరం, కడియం మండలాల్లో 23 ఘాట్లకు మరమ్మతులు,5 కొత్త ఘాట్ల నిర్మాణాలకు రూ.7 కోట్లు ప్రతిపాదించారు. మరోవైపు పర్యాటకానికి పెద్దపీట వేయనున్నారు.

చిన్నమ్మ చొరవ చూపాల్సిందే..



రాజమహేంద్రవరం ఎంపీగా పురందేశ్వరి ప్రాతినిధ్యం వహిస్తు న్నారు. రైల్వేపరంగా ఎంపీ వేగంగా కదిలినా పనుల్లో కదలిక కనిపించడం లేదు. పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం కంటే కేంద్ర ప్రభుత్వ నిధులే అత్యంత ప్రాధాన్యమైనవి.ఆ ని ధుల రాకలో కదలిక ఉండాలంటే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అయినా ఎంపీ ప్రస్తావించాలి. అయితే ఇప్పటి వరకూ కనీసం అధికారులు ఒక సమగ్రమైన డీపీఆర్(డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు) ఆమె చేతికి అందించలేదు. దీనిపై ఆమె కూడా కాస్త అసహనంగానే ఉన్నట్టు తెలుస్తోంది. చివరి నిమిషంలో హడా వుడి పడితే నిధుల దుర్వినియోగం కావడంతో పాటు పనుల్లో నాణ్యత కూడా నాసిరకంగా మారే అవకాశానికి మార్గం సుగమం చేసినట్లే.

- రెండేళ్లలో గోదావరి పుష్కరాలు
- రూ.3 వేల కోట్లతో అంచనాలు
- ఇంకనూ ప్రతిపాదనల్లోనే పనులు
- ఎక్కడా ఆరంభంకాని వైనం
- కానరాని పుష్కర ప్రత్యేకాధికారులు
- కేవలం రూ.100 కోట్లు విడుదల
- అవీ అఖండ గోదావరి నిధులు

రూ.3 వేల కోట్లు

రాజమహేంద్ర వరం,కొవ్వూరు డివిజన్లలో సుమారు రూ.440 కోట్ల అంచనా వ్యయంతో వివిధ ప్రాజెక్టులకు ప్రతిపాదనలు తయారు చేశారు. రెండు డివిజన్లకూ కలిపి అగ్నిమాపక శాఖ రూ.8 కోట్లు, ఆర్టీసీ రూ.27 కోట్లు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా రూ.25 కోట్లు, వైద్యారోగ్య రూ.8 కోట్లు, విద్యుత్ రూ.50 కోట్లు ఇలా అన్ని శాఖలూ ప్రతిపాదనలు పంపించాయి. మొత్తంగా 12 రోజుల్లో దాదాపు 10 కోట్ల మంది రాజమ హేంద్రవరం పరిసర ప్రాంతాలకు పుష్కర స్నా నాలకు వస్తారని అంచనా వేస్తుండగా.. రూ.3 వేల కోట్లకుపైగా ఖర్చు చేసి భక్తులకు ఇబ్బందీ కలగకుండా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది.



కవర్ల వినియోగంపై కలెక్టర్ సీరియస్

కఠినంగా ప్లాస్టిక్ నిషేధం

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్టు కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ పి. ప్రశాంతి తెలిపారు.నగరంలో సోమవారం ఆమె ఆకస్మిక దాడులు చేశారు.ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తున్నామన్నారు. పర్యావరణానికి హానికరమైన దాదాపు 20 రకాల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను ప్రభుత్వ నిషేధించిందన్నారు. 120 మైక్రాన్ల కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ కవర్లను నిలిపివేయాలన్నారు. ప్రజలంతా జ్యూట్ బ్యాగ్‌లు వాడాలన్నారు.ఆమె వెంట ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న తదితరులు ఉన్నారు.

'గృహనిర్మాణాలు వేగవంతం చేయండి'

రాజమహేంద్రవరం, జూలై14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గృహ నిర్మా ణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశించారు.నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి సోమవారం హౌసింగ్, రెవిన్యూ, విద్య తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి నిర్మాణంపై ఎంపీడీవోలు, ఏఈలు ర్యలు తీసుకోవాలన్నారు.పాఠశాలల్లో సౌకర్యాలు, మధ్యాహ్నం భోజన పథనం అమలు తనిఖీ చేసి ఎంపీడీవోలు, తహశీల్దార్లు నివేదిక ఇవ్వాలన్నారు.ఉప విభజన సర్వేనీటి పన్ను, సంక్షేమ హాస్టళ్ల సమస్యలపై జేసీ చిన్న రాముడు సమీక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లజర్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు కారణంగా పలు గ్రామాల్లో మంగళవారం నుంచి విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుల్లలపాడు అగ్రికల్చరల్ ఫీడర్, దూబచర్ల టౌన్ ఫీడర్, ప్రకాశరావుపాలెం టౌన్ ఫీడర్లకు ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా మూడురోజుల పాటు నిలిచిపోతుందన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


23వ వార్డులో మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

కొవ్వూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. పశివేదలలో సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి గత ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం అమలుచేసిన పథకాల గురించి వివరిస్తూ, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అప్పుల పాలైందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కాకర్ల నారాయుడు, బేతిన నారాయణ, గారపాటి రామచంద్రరావు, గారపాటి శ్రీనివాసరావు, ఉండవల్లి గోపాల్, కొప్పాక జవహర్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇదే గ్రామానికి చెందిన ఇద్దరికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 1,95,438 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే లబ్దిదారులకు అందజేశారు. ఉప్పులూరి వీరవెంకట సత్యనారాయణకి రూ. 1,53,646, వేములపల్లి వెంకటేశ్వరరావుకి రూ. 41,792 పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కాకర్ల నారాయుడు, బేతిన నారాయణ, గారపాటి రామచంద్రరావు, గారపాటి శ్రీనివాసరావు, ఉండవల్లి గోపాల్, కొప్పాక జవహర్, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మల్లవరం, చంద్రవరం గ్రామాల్లో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మద్దిపాటి వీరరాఘవులు, టీడీపీ నాయకులు, సర్పంచ్ కోడూరి లక్ష్మీ సుభాషిణి, ఉప సర్పంచ్ కాశి గంగాధరం, ఎంపీటీసీ గారపాటి నరసింహమూర్తి, టీడీపీ నాయకులు అన్నమరెడ్డి రాజాబాబు, కోడూరి వెంకటరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మహిళలు కూటమి పాలనపై సంతృప్తిగా ఉన్నట్టు రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. సోమవారం మోర్తలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వం హయాంలో రాష్ట్రం ఆర్థికంగా వెనుకబడినా ... ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన పరిపాలనాదక్షతతో ఆర్థిక వనరులు కల్పిస్తున్నారన్నారు. అనంతరం మహిళలు శేషారావుకు హారతులు పట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, టీడీపీ నాయకులు రాచమళ్ల శ్రీనివాసరావు, వెలిచేటి ప్రసాద్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


మోర్తలో ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు

'కోట' మృతి సినీ పరిశ్రమకు తీరని లోటు

కొవ్వూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు మృతి తెలుగు చిత్ర పరిశ్రమకు తీరని లోటని ఏఎన్ఆర్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీకే రంగారావు అన్నారు. సోమవారం ఆయన కొవ్వూరులో మాట్లాడుతూ గత 48 సంవత్సరాలుగా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మళయాళం భాషల్లో దాదాపుగా 750 చిత్రాల్లో నటించారన్నారు. విలన్‌గా, కమెడియన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఏ పాత్రలోనైనా తనదైన శైలిలో నటించి ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. అంతేకాకుండా రాజకీయాలలో ప్రవేశించి విజయవాడ ఎమ్మెల్యేగా విజయం సాధించారన్నారు.

ఆరికిరేవుల సొసైటీ సభ్యులకు 3 శాతం వడ్డీ రాయితీ

కొవ్వూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఆరికిరేవుల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో 2022-23 సంవత్సరానికి 3 శాతం వడ్డీ రాయితీని ప్రభుత్వం మంజూరు చేసిందని ఆ సొసైటీ అధ్యక్షుడు చావా రామకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. సొసైటీ పరిధిలోని ఆరికిరేవుల, కుమారదేవం, చిడిపిలోని రైతులకు సంబంధించి రూ. 12,25,195 వడ్డీ రాయితీ మంజూరయ్యిందన్నారు. దీన్ని సొసైటీ సభ్యులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కార్యదర్శి చావా ప్రసాద్ కోరారు.

నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి


గోపాలపురం జడ్పీ హైస్కూల్ వద్ద నిర్మిస్తున్న కల్వర్టు లోతును కొలుస్తున్న డీఈ పార్వతి

గోపాలపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కల్వర్టు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పార్వతి అన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్ గేటు వద్ద జరుగుతున్న కల్వర్టు నిర్మాణ పనులను ఆమె సోమవారం పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి అనురాధ, ఏఎంసీ డైరెక్టర్ కూనపం ప్రసాద్‌బాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు జ్యేష్ఠ శ్రీధర్, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ


విద్యార్థులకు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి

తాళ్లపూడి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గజ్జరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం పుస్తకాలు, పెన్నులు అందించారు. కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీఎమ్మెల్యే తలారి వెంకట్రావు పాల్గొని మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుకునేందుకు ఇబ్బందులు రాకూడదనే ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా వీటిని అందించామన్నారు. కార్యక్రమంలో గజ్జరం సర్పంచ్ గండి రాంబాబు, కొలిశెట్టి నాగేశ్వరరావు, ఎల్లిన శ్రీనివాస్, పిట్టా శ్రీను, నూతంగి సురేష్, నందా, తదితర నేతలు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గోపాలపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో రాజమనోహర్ తెలిపారు. దీనికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరుగుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. అందువల్ల ఆయాగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సంబంధిత శాఖాధికారులు, తప్పనిసరిగా పాల్గొనాలన్నారు.

కరుటూరి ధనుంజయుడికి పితృవియోగం


మాజీ సర్పంచ్ సూర్యారావు (ఫైల్)

దేవరపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దుకూరుకి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త కరుటూరి ధనుంజయుడు తండ్రి, మాజీ సర్పంచ్ కరుటూరి సూర్యారావు బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. సూర్యారావు 1970-75 కాలంలో దుద్దుకూరు సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. ఆయనకు పారిశ్రామికవేత్త కరుటూరి ధనుంజయుడు, కరుటూరి శ్రీరామ్మూర్తి కుమారులు కాగా, కుమార్తె ఆచంట లక్ష్మి ఉన్నారు. కుమార్తె అమెరికాలో ఉండటం వల్ల అంత్యక్రియలు బుధవారం జరుపుతున్నట్టు కుటుంబ సభ్యులు, తదితరులు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ ఒక వరం : మంత్రి దుర్గేష్


నిడదవోలులో బాధితులకు చెక్కులు అందిస్తున్న మంత్రి

నిడదవోలు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య భద్రతకు సీఎంఆర్ఎఫ్ ఒక వరమని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. సోమవారం నిడదవోలు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో 33 మంది బాధితులకు మంజూరైన రూ. 30,94,913 లక్షల చెక్కులు, ఎన్‌వోసీ పత్రాలను ఆయా బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు మొత్తం 192 మందికి రూ. 1,84,00,000 లబ్ధి చేకూరిందన్నారు. నిరుపేదలు ఎవరైనా ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటే వారికి ఆర్థికంగా ఇబ్బందులు కలగకూడదనే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థికసహాయం అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, లబ్ధిదారులు పాల్గొన్నారు. అలాగే కూచిపూడి కళలను వెలుగులోకి తీసుకురావడం ఎంతో శుభపరిణామమని మంత్రి అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని రోటరీ ఆడిటోరియంలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో భ్రామరి కూచిపూడి నాట్య నిలయం వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి దుర్గేష్, రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వై.కల్యాణ్ చక్రవర్తి హాజరై మాట్లాడుతూ కళలకు ప్రోత్సాహానిచ్చే ఉద్దేశంతో కూచిపూడి నృత్య ప్రదర్శనలకు రోటరీ క్లబ్ వేదిక కావడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు మీసాల శివరామ హరిప్రసాద్, కార్యదర్శి దారపురెడ్డి ప్రతాప్, ట్రెజరర్ గుంటుపల్లి సత్యసాయి, డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, పెన్మత్స చందువర్మ, పాటి అయ్యప్ప, తదితరులు పాల్గొన్నారు.

డివిజనల్ పీజీఆర్ఎస్‌కు 17 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

కొవ్వూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న డివిజనల్ పీజీఆర్ఎస్‌లో 17 ఫిర్యాదులు స్వీకరించినట్టు ఆర్డీవో డాక్టర్ రాణీసుస్మిత తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ వాటిని ఆయాశాఖల అధికారులకు పంపించి సత్వరం పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనికి డివిజనల్ స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. అలాగే ప్రజలు తమ సమస్యలను మండల కేంద్రాలలో నిర్వహించే పీజీఆర్ఎస్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చన్నారు. లేదా టోల్‌ఫ్రీ నెంబర్ 1100కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల డివిజనల్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రసిద్ధ కవి గరిమెళ్ల జయంతి


గరిమెళ్ల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తాళ్లపూడి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పైడిమెట్టలో గల మండల పరిషత్ మేసిక్ పాఠశాలలో సోమవారం ప్రసిద్ధ కవి, స్వాతంత్ర్య సమరయోధుడు గరిమెళ్ల సత్య నారాయణ జయంతిని ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం దున్నా దుర్గారావు మాట్లాడుతూ గరిమెళ్ల శ్రీకాకుళం జిల్లాలోని గోనెపాడులో 1847 జూలై 14న జన్మించారని తెలిపారు. ఆయన విజయనగరం, రాజమహేంద్రవరం, మచిలీపట్నం, పలుచోట్లపై చదువులు చదివారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ధర్మాన రాము, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయండి ... మరొకరి ప్రాణాలు కాపాడండి


తహశీల్దార్ కార్యాలయం వద్ద కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తహశీల్దార్ అజయ్‌బాబు

గోపాలపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): యువత రక్తదానం చేసి మరొకరి ప్రాణాలు కాపాడేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని తహశీల్దార్ కే.అజయ్‌బాబు పిలుపునిచ్చారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఈనెల 30వ తేదీన మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదాన శిబిరానికి సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల ద్వారా రక్తదాన శిబిరాలకు ఇచ్చిన రక్తాన్ని అత్యవసర సమయంలో ఉపయోగించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

● మున్సిపల్ కమిషనర్ గ్రంధి సందీప్

కొవ్వూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మున్సిపాల్టీలో మంగళవారం నుంచి 25వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ గ్రంధి సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీన శ్రీరామకాలనీ సచివాలయం, 16న గౌతమీనగర్ -2లో సచివాలయం 5, 17వ తేదీన ఔరంగాబాద్ సచివాలయం, 18వ తేదీన ఆవులవారి వీధిలో సచివాలయం 10, 22వ తేదీన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, 23వ తేదీన ప్రభుత్వ జూనియర్ కళాశాల, 24వ తేదీన అల్లూరి నాగరత్నం జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్, 25వ తేదీన పండిత మదన మోహన మాలవ్య మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణాలలో క్యాంపులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

జవహర్‌ను కలిసిన ఉద్యోగులు


రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌కు మొక్కను అందజేస్తున్న దృశ్యం

కొవ్వూరు, జూలై 14 (ఆంధ్ర జ్యోతి): యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సోమవారం రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు మొక్కను అందిస్తూ, శాలువాను కప్పి సత్కరించారు. బ్యాంకింగ్ వ్యవస్థలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేసి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో ఆలిండియా ప్రెసిడెంట్ జి.దయాకర్, వైస్‌ప్రెసిడెంట్ చిరంజీవి, ఎస్.లక్ష్మణరావు, రత్నతేజ, రాజేంద్రప్రసాద్, నీలాంబర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి రూపేశ్‌కు అభినందనలు


ఐఐఐటీకి ఎంపికైన సోమిశెట్టి రూపేష్ అభినందిస్తున్న ఎంఈవోలు

దేవరపల్లి, జూలై14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి చదివిన సోమిశెట్టి రూపేశ్‌కు శ్రీకాకుళం ఐఐఐటీలో సీటు రావడంతో రూపేశ్‌ను సోమవారం ఎంఈవోలు ఎం.తిరుమలదాసు, అప్పారావు అభినందించారు. 10వ తరగతి పరీక్షల్లో 566 మార్కులు సాధించినట్టు చెప్పారు. రూపేశ్ తండి తండ్రి శ్రీనివాస్ మాట్లాడుతూ తాను ప్రకృతి వ్యవసాయంలో ట్రైనర్‌గా పనిచేస్తున్నా నని తెలిపారు. ఐఐఐటీలో సీటు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయుడు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో హెచ్‌ఎం మృతి

నల్లజర్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు విద్యాశాఖ, సమగ్ర శిక్ష నిర్వహిస్తున్న నాలుగు రోజుల శిక్షణ తరగతులలో పాల్గొన్న ఒక ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో మృతిచెందినట్టు అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్యాంసుందర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి సాల్ట్ (సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్)లో హెచ్‌ఎంలకు నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు నాలుగురోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులు ప్రకాశరావుపాలెం వైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ తరగతులకు రిసోర్సుపర్సన్‌గా వ్యవహరించే పాలకొల్లు మండలం అరటకట్ట జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎస్వీఆర్ మూర్తిరాజు (60) గుండెపోటుతో మృతిచెందారు. పాలకొల్లులో బయలుదేరిన ఈయన తాడేపల్లిగూడెం బస్టాండ్‌కు వచ్చేసరికి అస్వస్థతకు గురయ్యారు. షుగర్ డౌన్ అయ్యిందేమోనని చాక్లెట్ తిని మళ్లీ బయలుదేరారు. ఆ తర్వాత శిక్షణ కేంద్రానికి వచ్చి అటెండెన్స్ రిజిస్టరులో సంతకం చేసి కుప్పకూలిపోయారు. అక్కడి వారు ఆయనకు సీపీఆర్ చేసి వెంటనే కారులో తాడేపల్లిగూడెంలోని ఆసుపత్రికి తీసుకుని వెళుతున్న తరుణంలో మార్గమధ్యలో మృతిచెందినట్టు శ్యాంసుందర్ తెలిపారు. మృతదేహాన్ని డీఈవో నారాయణ అంబులెన్స్‌లో పాలకొల్లు తీసుకుని వెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు అమెరికాలో ఉండగా కుమార్తె హైదరాబాద్‌లో ఉంటున్నారు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహిస్తారని బంధువులు చెప్పారు. దీంతో శిక్షణ తరగతులను వాయిదా వేసినట్టు అధికారులు తెలిపారు.

గుర్రపు డెక్క తొలగింపు పూర్తిచేయాలి

గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సునీల్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 14(ఆంధ్రజ్యోతి): సాగునీటి కాలువలు, డ్రైనేజీల్లో తూడు, గుర్రపు డెక్క తొలగింపు పనులు సత్వరం పూర్తి చేయాలని గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ కోరారు. సోమవారం స్థానిక నీటిపారుదల శాఖ కార్యాలయంలో గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిపారుదల సక్రమంగా జరిగేందుకు చివ రి ఆయకట్టుకు కూడా సాగునీరు అందించేందుకు కాలువలు, డ్రైనేజీల్లో తూడు, గుర్రపు డెక్క తొలగించాలన్నారు. నీటితీరువా వసూళ్లకు రెవె న్యూ సిబ్బందికి సహకరించాలన్నారు. నీటితీరువా వసూళ్లు జరిగితే సాగునీటి అభివృద్ధి పనులు చేపట్టడానికి నిధులు సమకూరుతాయన్నారు. గ్రామస్థాయి నుంచి నీటితీరువా వసూళ్లపై దృష్టిసారించాలని సునీల్‌కుమార్ అన్నారు. ఈస్ట్రన్ డెల్టా సూపరింటెండెంట్ ఇంజనీర్ గోపినాథ్ మాట్లాడుతూ సమర్థవంతమైన నీటి నిర్వహణ, నీటి ఆడిటింగ్ జరపాలని కోరారు.

కాలువలపై ఆక్రమణలను గుర్తించాలని, రెవెన్యూ సమన్వయం చేసుకుని తొలగింపుకు ప్రయత్నాలు చేయాలని కోరారు. గోదావరి ఈస్ట్రన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీవీ రామకృష్ణ మాట్లాడుతూ గోదావరి డెల్టా ప్రాజెక్టు పరిధిలో రూ.6.10 కోట్లతో 159 పనులకు కమాండ్ యాక్షన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి యాక్షన్ ప్లాన్‌కు అనుమతి లభించిందని తెలిపారు. వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, డ్రైనేజీ డివిజన్ ఈఈ ఎంవీవీ కిషోర్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంబగా పలువురు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు పలు ప్రతిపాదనలు చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ పరిధిలో 15 మంది డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, వివిధ డివిజన్ల డీఈఈలు, ఏఈలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తిరుమల విద్యార్థులకు మంత్రి లోకేశ్ అభినందన


విద్యార్థిని అభినందిస్తున్న మంత్రి లోకేశ్

రాజమహేంద్రవరం రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నీట్-2025లో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 19వ ర్యాంకు, స్టేట్ మొదటి ర్యాంకు సాధించిన రాజమహేంద్రవరంలోని తిరుమల విద్యార్థి డి.కార్తీకరామ్‌కిరీటిని రాష్ట్ర విద్య, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ అభినందించారు. అలాగే జేఈఈ అడ్వాన్స్-2025లో ఈడబ్ల్యుఎస్ కేటగిరిలో ఆలిండియా 8వ ర్యాంకు సాధించిన కె.యశ్వంత్‌సాత్విక్, ఎస్సీ కేటగిరిలో ఆలిం డియా 2వ ర్యాంకు సాధించిన కె.ప్రణీత్‌లను మంత్రి లోకేశ్ పుష్పగుచ్ఛంతో సత్కరించారు. విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావును అభినందించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, విద్యార్థుల తల్లిదండ్రులతో లోకేశ్‌ను కలిసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిన్న చిన్న విషయాలకే నేటి తరం విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని, లైఫ్ అంటేనే చాలెంజ్ అని దానిని ధైర్యంగా స్వీకరించాలని అధైర్య పడకూడదని చెప్పారు.

ఫేక్ ష్యూరిటీ పెట్టిన కేసులో ..

ఇద్దరికి రెండున్నరేళ్ల జైలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు పోలీసు స్టేషన్ కేసులో ప్రోపర్టీగా ఉన్న ఆయిల్ ట్యాం కర్‌ను రిలీజ్ చేయించుకునేందుకు ఇద్దరు వ్య క్తులు ఫేక్ ష్యూరిటీ పెట్టినట్టు విచారణలో వెల్లడికావడంతో వారికి రాజమహేంద్రవరం 3వ అడిషనల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సిరయ్య రెండు న్నరేళ్ల జైలు శిక్ష విధించారు. త్రీటౌన్ పోలీసులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. 2018 అక్టోబరు 3న బొమ్మూరు కేసులో ప్రోపర్టీగా ఉన్న అయిల్ ట్యాంకర్‌ను విడిపించేందు కు రాజమహేంద్రవరం కంబాలపేటకు చెందిన బట్టు కుమార్, విశాఖపట్నంలోని శ్రీనగర్‌కు చెందిన నాగవల్లి రామకృష్ణ రాజమండ్రి 7వ అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో సబ్మిట్ చేసిన ష్యూరిటీలలో అధికారి సంతకం పోర్జరీ చేసినట్టు అనుమానం రావడంతో అప్పట్లో దీని పై విచారణ జరపాలని న్యాయస్థానం ఆదేశించింది.దీంతో త్రీటౌన్ పోలీసులు విచారణ జరిపి వారు ఇచ్చిన ష్యూరిటీ ఫేక్ అని నిర్ధారించారు. దీంతో సోమవారం న్యాయమూర్తి తీర్పును వెల్లడించారు. నిందితులకు రెండున్నరేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమాన విధించారు. నిందితులకు శిక్ష పడడంలో ఏపీపీ సీహెచ్ రాజశేఖర్, త్రీటౌన్ సీఐ అప్పారావు, కోర్టు కానిస్టేబుల్ పి.కొండబాబులు కృషి చేశారు. వారిని జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ అభినందించారు.

కోడిపందాల స్థావరాలపై పోలీసుల దాడి


పట్టుబడిన వ్యక్తులతో ఎస్ఐ మనోహర్

గోపాలపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వెంకటాయపాలెం, దొండపూడి గ్రామ శివారుల్లో రహస్యంగా కోడిపందాలు నిర్వహిస్తున్న స్థావరాల పై ఎస్ఐ వీ.మనోహర్ తన సిబ్బందితో కలిసి సోమవారం దాడి చేశారు. వెంకటాయపాలెం గ్రామ శివారుల్లో ఉన్న ఫామాయిల్ తోటలో కోడిపందాలు నిర్వహిస్తున్నట్టు వచ్చిన సమాచారంతో తన సిబ్బందితో దాడి చేసి ఎనిమిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 3800 నగదు, రెండు కోడిపుంజులు, రెండు కోడికత్తులు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అలాగే దొండపూడిలో నిర్వహిస్తున్న కోడిపందాలపై దాడి చేసి 12 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 8020 నగదుతో పాటు రెండు కోడిపుంజులు, రెండు కోడికత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు. రెండుచోట్లా 20 మంది పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

విద్యార్థులకు అదనపు భోజనం అందజేత

ఉండ్రాజవరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోర్త-2 పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు సోమవారం అదనపు భోజనం అందించినట్టు ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎల్‌వీ ప్రసాద్ తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన చప్పిడి హనుమంతు, భాగ్యలక్ష్మి మనుమరాలు పినిశెట్టి విషిత పుట్టినరోజు సందర్భంగా స్వీట్స్, ఐస్ క్రీమ్, బిస్కెట్లు, చాకెలెట్లు, పెన్సిల్స్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.